Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 149 మేడ్చల్ మల్కాజ్‌గిరి 20 జూన్ 2023 మంగళవారం పేజీలు : 4

## పీఎస్‌యూల్లో 2 లక్షల ఉద్యోగాలు ఊస్ట్

న్యూఢిల్లీ : యువత ఆశలపై కేంద్రంలోని బీజేపీ సర్కార్ నీళ్లు చల్లిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థ(పీఎసయూ)ల్లో 2 లక్షలకు పైగా ఉద్యోగాలను కేంద్రం తొలగించిందని ఆరోపించారు. కొందరు పెట్టుబడిదారి మిత్రుల కోసమే బీజేపీ ఇదంతా చేస్తోందని విమర్శించారు. పీఎసయూలు ఒకప్పుడు దేశానికి గర్వకారణమని.. ఇప్పుడు ప్రభుత్వం వాటిని పట్టించుకోవడమే మానేసిందన్నారు. "2014లో పీఎసయూల్లో 16.9 లక్షల ఉద్యోగాలుండేవి. 2022 నాటికి అవి 14.6 లక్షలకు చేరాయి. అభివృద్ధి చెందుతున్న దేశంలో ఎక్కడైనా ఉద్యోగాలు తగ్గుతాయా? బీఎసఎన్ఎల్‌లో 1.81 లక్షలు, సెయిల్‌లో 61,928, ఎంటీఎన్ఎల్‌లో 34,997, ఎస్ఈసీఎల్‌లో 29,140, ఎఫ్‌సీఐలో 28,063, ఓఎన్‌జీసీలో 21,120 ఉద్యోగాలు పోయాయి" అని రాహుల్ ట్వీట్ చేశారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తామంటూ తప్పుడు వాగ్దానాలు చేసిన బీజేపీ ప్రభుత్వం.. ఇప్పుడు 2 లక్షలకు పైగా ఉద్యోగాలను తొలగించిందని ఫైర్ అయ్యారు.

# అనేక రంగాల్లో నెం. 1 స్థానంలో తెలంగాణ

## పాలమూరు ఎత్తిపోతలను అడ్డుకున్న పుణ్యాత్ములు కాంగ్రెస్ నేతలే.. సీఎం కేసీఆర్ ధ్వజం

రంగారెడ్డి : పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకున్న పుణ్యాత్ములు కాంగ్రెస్ నేతలే అని ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. ఎండిపోయిన గడ్డకు నాలుగు నీళ్ల చుక్కలు తెచ్చుకుందామంటే కాంగ్రెస్ నాయకులు సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చి ఆపుతున్నారని కేసీఆర్ తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని తుమ్మలూరులో నిర్వహించిన 9వ విడత హరితహారం కార్యక్రమంలో కేసీఆర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ ప్రసంగించారు. తెలంగాణ కొద్దిగా పచ్చబడింది అని కేసీఆర్ అన్నారు. 8 ఏండ్ల నుంచి పట్టుబట్టి జట్టుకట్టి బీడు వారిపోయినా తెలంగాణను ఒక తొవ్వకు తెచ్చుకుంటున్నాం. వడ్లు పండించడంలో 2014లో మనం 15,16వ స్థానంలో ఉన్నాం. ఇవాళ దేశంలో అతి ఎక్కువ వడ్లు పండించిన రాష్ట్రం తెలంగాణ అని పత్రికల్లో వచ్చింది. ఇలా అనేక రంగాల్లో నంబర్‌వన్‌లో ఉన్నాం. ధనం ఎంత ఉన్నా పిల్లలకు బతికే అవకాశం ఉండాలి.

**హరితహారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జోకులేశారు..** మనకు భూమి, నీళ్లు, అడవులు ఉన్నాయి. విస్తృతంగా చెట్లు పెంచితే అపారమైన ఆక్సిజన్ లభిస్తుందని కేసీఆర్ పేర్కొన్నారు. అద్భుతమైన అవకాశం ఉన్న దేశంలో అడవులను నాశనం చేశారు. హరితహారం అనే చెబితే చాలా మందికి అర్థం కాలేదు. హాస్యాస్పదం చేశారు. కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శాసనసభలో జోకులు వేశారు. తుమ్మలూరులో మూడు, నాలుగేండ్ల కింద పెట్టిన చెట్లు పెద్దగా అయ్యాయి. ఈ విధంగా అన్ని ప్రాంతాల్లో పెట్టిన చెట్లతో తెలంగాణలో 7.7 శాతం పచ్చదనం పెరిగింది. అందరి కన్నా ముందుగా మన గ్రామ సర్పంచులను అభినందిస్తున్నాను. నేను చట్టం తెచ్చినప్పుడు వాళ్లకు కోపం వచ్చింది. ఆ చట్టం వల్ల ఇవాళ గ్రామాలు పచ్చగా మారాయి. తెలంగాణలో దారులు అందంగా తయారయ్యాయని కేసీఆర్ తెలిపారు.

**పాలమూరు ప్రాజెక్టు 85 శాతం పూర్తి..** ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో నీళ్ల కోసం పంచాయతీ ఉందని కేసీఆర్ తెలిపారు. పాలమూరు ఎత్తిపోతల కూడా కాళేశ్వరంతో పాటే పూర్తయ్యేది. కానీ సుప్రీంకోర్టు దాకా వెళ్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. ఎండిపోయిన గడ్డకు నాలుగు నీళ్ల చుక్కలు తెచ్చుకుందామంటే కాంగ్రెస్ నాయకులు స్టేలతో ఆపుతున్నారు. భగవంతుడి దయ వల్ల పాలమూరు ప్రాజెక్టు 85 శాతం పూర్తయింది. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, తాండూరు, పరిగి, వికారాబాద్ చేవెళ్ల నియోజకవర్గాలకు నీళ్లు ఇచ్చే బాధ్యత నాది. హామీ ఇస్తున్నాను.. 100 శాతం ఈ ప్రాంతానికి నీళు తీసుకువస్తాను అని కేసీఆర్ స్పష్టం చేశారు. కృష్ణా నదిలో నీళ్ల కోసం పంచాయతీ ఉందని కేసీఆర్ అన్నారు. గోదావరిలో నీళ్ల పంచాయతీ లేదు. గండిపేట, హిమాయత్ సాగర్ వరకు గోదావరి లింక్ అయిపోతుంది. అక్కడ్నుంచి చిన్న లిఫ్ట్ పెట్టినా కూడా నీళ్లు ఇచ్చే అవకాశం ఉంది. ఏదో ఒక పద్ధతిలో ఈ ప్రాంతానికి నీళ్లు తెచ్చి ఇస్తాను. చింత చేయాల్సిన అవసరం లేదు అని కేసీఆర్ ఉద్ఘాటించారు.


**హరితహారంతో 7.7 శాతం పెరిగిన పచ్చదనం :** తెలంగాణ ఏర్పడిన కొత్తలో భయంకరమైన పరిస్థితి ఉండే అని కేసీఆర్ గుర్తు చేశారు. నీళ్లు లేక ఇబ్బంది పడ్డాం. తద్వారా చెట్లను పెంచాలని నిర్ణయించాం. వానలు వాపస్ రావాలె.. కోతులు వాపస్ పోవాలె అని నేనే పాట రాశాను. పచ్చదనం ఉంటేనే వర్షాలు వస్తాయి. చెట్లు నాటడం ఏందని చాలా మంది నవ్వారు. కేసీఆర్ ప్రారంభించిన కార్యక్రమంతో తెలంగాణలో పచ్చదనం పెరిగింది. నాశమైన అడవులను పునరుద్ధరించాలని నిర్ణయించాం. అడవులను పెంపొందించేందుకు హరిత సైనికుల్లాగా ప్రియాంక వర్గీస్, భూపాల్ రెడ్డి ఎంతో కృషి చేశారు. రిజర్వ్ ఫారెస్టును బ్రహ్మాండంగా పెంచుకున్నాం. గ్రామాల్లో నర్సరీలను పెంచుకోవాలి. హరితహారం కార్యక్రమాన్ని వదిలిపెట్టొద్దు అని సర్పంచ్‌లను కోరుతున్నాను. బతకడానికి వీలైన పర్యావరణ



పరిస్థితులు కల్పించాలి. హరితహారంలో అనేక అద్భుతాలు జరిగాయన్నారు కేసీఆర్. తెలంగాణలో.. ప్రతి గ్రామంలో నర్సరీ, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసుకున్నాం. అర్బన్ పార్కులు కూడా రూపుదిద్దుకున్నాయి. ఈ విజయం మనందరి విజయం. ప్రజలకు అవసరమైన పండ్ల మొక్కలను పంచేందుకు ఒక వంద కోట్ల బడ్జెట్ అయినా పెట్టి పంచాలని నిర్ణయించాం అని కేసీఆర్ తెలిపారు.

## బీఆర్ఎస్ కు సన్ స్ట్రోకులు తప్పవా ?

హైదరాబాద్ : రాబోయే ఎన్నికల్లో కేసీయార్ కు భిన్నకోణాల్లో సమస్యలు తప్పేట్లు లేదు. పొంచి ఉన్న అనేక సమస్యల్లో సన్ స్ట్రోకులు కూడా కీలకమైనదే అని టాక్ నడుస్తోంది. చాలా మంది మంత్రులు ఎంఎల్ఏల వారసులు రాబోయే ఎన్నికల్లో పోటీచేయటానికి రెడీ అవుతున్నారు. తండ్రుల పదవులను అడ్డంపెట్టుకుని కొందరు వారసులు తమ నియోజకవర్గాల్లో మొత్తం ఊడ్చిపారేస్తున్నారట. దాంతో మంత్రులతో పాటు వారసులపైన కూడా నియోజకవర్గాల్లో విపరీతమైన వ్యతిరేక త పెరిగిపోతోందన్న విషయం సర్వేల్లో బయపడిందట. అందుక నే వారసులకు టికెట్లు కావాలని పట్టుబడుతున్న చాలామందికి కేసీయార్ నో చెప్పేస్తున్నట్లు సమాచారం. తాను చేయించుకున్న సర్వేల్లో వారసులకు బాగా బ్యాడ్ ఇమేజి ఉందని అందుకని టికెట్ ఇచ్చినా గెలుపు కష్టం కాబట్టి ఈసారికి మీరే పోటీచేయాలని మంత్రులకు కేసీయార్ గట్టిగా చెబుతున్నారట. అసెంబ్లీ స్పీకర్ శాసనమండలి ఛైర్మన్ గా ఉన్న పోచారం శ్రీనివాసులరెడ్డి గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా వారసులకు టికెట్లివ్వాలని పట్టుబడుతున్నారు.




అయితే వారసులకు టికెట్లిచ్చేది లేదని చెప్పి పోచారంనే పోటీచేయమన్నారట కేసీయార్. గుత్తా విషయంలో కూడా కేసీయార్ నో చెప్పినట్లు సమాచారం. వీళ్ళు కాకుండా వరంగల్ మహబూబ్ నగర్ రంగారెడ్డి జిల్లాల్లోని మంత్రులు కూడా వారసులకు టికెట్లు ఇవ్వాలని గట్టిగానే పట్టుబడుతున్నారట. అయితే అందుకు కేసీయార్ ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. రాబోయే ఎన్నికలు పార్టీకి చాలా కీలకమైనవని కాబట్టి వారసులకు టికెట్లిచ్చి గెలుపులో ఛాన్స్ తీసుకునే సమస్యేలేదని కేసీయార్ తెగేసి చెబుతున్నారట. మరికొందరికైతే సర్వే రిపోర్టును చూపిస్తున్నారట. వాళ్ళ వారసులకు ఉన్న ఇమేజి ఏమిటో వివరించి చెబుతున్నారట. దాంతో ఇటు కేసీయార్ ను కన్వీన్స్ చేయలేక అటు వారసుల ఒత్తిళ్ళను తట్టుకోలేక మంత్రులు ఎంఎల్ఏలు నానా అవస్తలు పడుతున్నారు. ఒక మంత్రయితే అల్లుడికి ఎంపీ టికెట్ కొడుకుల్లో ఒకళ్ళకు ఎంఎల్ఏ టికెట్ ఇవ్వాలని కేసీయార్ ను పదేపదే అడుగుతున్నారట. వరంగల్ జిల్లాలోని ఇంకో సీనియర్ ఎంఎల్ఏ కూడా కొడుక్కి టికెట్ కావాలని అడిగితే ఇప్పటికే కుటుంబంలో రెండు టికెట్లిచ్చిన కారణంగా కొడుక్కి ఎంఎల్ఏ టికెట్ ఇవ్వటం సాధ్యంకాదని చెప్పేశారట. చూస్తుంటే బీఆర్ఎస్ కు సన్ స్ట్రోకులు తప్పేట్లు లేదు.

# కాంగ్రెస్‌లో షర్మిల పార్టీ విలీనం...

## ముహూర్తం ఎపుడంటే...?

అమరావతి : మొత్తానికి తెలంగాణాలో ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ అనూహ్యమైన పరిణామం ఒకటి జరగబోతోంది. వైఎస్సార్ ముద్దుల తనయ ఏపీ సీఎం జగన్ చెల్లెలు వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో తన పార్టీ వైఎస్సార్ టీపీని విలీనం చేయబోతున్నారు. ఈ మేరకు సూత్రప్రాయంగా అంగీకారం కుదిరింది అని అంటున్నారు. తొందరలోనే కాంగ్రెస్ లో షర్మిల పార్టీ విలీనం కావడం ఖాయమని అంటున్నారు. ఇదిలా ఉంటే ఈ మొత్తం వ్యవహారం ఒక కొలిక్కి రావడానికి కీలకమైన పాత్ర పోషించినది వైఎస్సార్ ఒకనాటి మిత్రుడు ఆయన ఆత్మ అయిన కేవీపీ రామచంద్రరావు అని అంటున్నారు. ఆయన మాట అంటే షర్మిలకు గౌరవం అని అంటున్నారు. ఆ గౌరవంతోనే ఆమె తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసేందుకు అంగీకరించారు అని అంటున్నారు. ఇక కర్నాటక కాంగ్రెస్ చీఫ్ డిప్యూటీ చీఫ్ అయిన డీకే శివకుమార్ కూడా ఈ విషయంలో పావులు కదిపారు. మరో వైపు చూస్తే ఒంటరిగా షర్మిల తన పార్టీని రెండేళ్లుగా నడుపుకుంటూ వస్తోంది. ఆమె ఏకంగా ఏ మూడు వేల ఏడువందల కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. అయినా సరే పార్టీ ఏ మాత్రం ఎక్కడా లేవలేదు. కనీసం లీడర్ ఒకరు కూడా ఆమె పార్టీలో చేరలేదు. కేసీయార్ తో ఒంటరి పోరు చేస్తూ వస్తున్న షర్మిలకు ఇపుడు ఎన్నికల వేళ పోటీ చేసి గెలవడం ఒంటరిగా చూస్తే కష్టంగా క్లిష్టంగా మారింది అని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే షర్మిల పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసుకుంటే ఏపీలో కూడా తనకు ఎంతో కొంత వైఎస్ ఫ్యామిలీ మద్దతు ఉన్నట్లుగా చెప్పుకోవచ్చు అన్నది కాంగ్రెస్ ప్లాన్ గా ఉంది. ఇక షర్మిలను ఏపీ రాజకీయాల్లోనే ఉంచాలని ప్రయత్నం జరిగినా ఆమె నో చెప్పారని అంటున్నారు. ఆమె ఖమ్మం జిల్లా పాలేరు నుంచి వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేస్తారు అని అంటున్నారు. దానికి కాంగ్రెస్ అధినాయకత్వం అంగీకరించింది అని తెలుస్తోంది. మొత్తం మీద షర్మిల పార్టీ చేరడం తెలంగాణా రాజకీయాలో అతి ముఖ్య పరిణామం అని అంటున్నారు. అయితే కాంగ్రెస్ లో ఎన్నో గ్రూపులు వర్గాలు ఉన్నాయి. ముఖ్యంగా వైఎస్సార్




వ్యతిరేకులు కూడా ఉన్నారు. అటువంటి చోట ఆంధ్రా మూలాలు ఉన్న షర్మిల ఎలా సర్దుకుంటారు అన్నదే చర్చ. తాను తెలంగాణా కోడలిని అని కార్డుని తీస్తున్నా కూడా సీనియర్ల నుంచి మాత్రం ఎలాంటి రియాక్షన్ వస్తుందో తెలియడలేదు అంటున్నారు. కేవీపీ రామచంద్రరావు మీద కూడా టీ కాంగ్రెస్ నేతలు గుస్సా అవుతున్న సందర్భాలు ఉన్నాయి. ఆయన ప్రపకంతో కర్నాటక నేత ప్రోత్సాహంతో కాంగ్రెస్ లో ఎంట్రీ ఇస్తున్న షర్మిల అక్కడ ఎలా నెగ్గుకుని వస్తారు అన్నది చూడాలని అంటున్నారు.

# అమిత్ షా మిషన్ తెలంగాణ!



## వేరే పార్టీల్లో రాజీనామాలు.. బీజేపీలో చేరికలు అన్నీ ఆయన డైరెక్షన్‌లోనే?

## ఐదు నెలల వ్యవధిలో మూడు సార్లు రాష్ట్రానికి..

## బీఆర్ఎస్‌ను గద్దె దించడమే లక్ష్యంగా చక్రం

హైదరాబాద్ : ఐదు నెలల వ్యవధిలోనే మూడు సార్లు రాష్ట్రానికి వచ్చిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడమే లక్ష్యంగా చక్రం తిప్పుతున్నారా.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికల పరంపర జోరందుకోనుందా.. అంటే అవుననే తెలుస్తోంది. అమిత్ షా మార్గదర్శనంలో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు అనూహ్యంగా మారబోతున్నాయని జాతీయ స్థాయి బీజేపీ నేత ఒకరు చెప్పారు. 'సందేహం అక్కర్లేదు. పెనుమార్పులు ఉంటాయి' అన్నారు. 'ప్రతి జిల్లాలో ఒక బలమైన నేత పార్టీకి అండగా ఉండేలా తక్షణం రంగంలోకి దిగండి' అని అమిత్ షా నెల రోజుల కిత్రం రాష్ట్ర పార్టీ ముఖ్యులకు ఆదేశాలిచ్చారు. మరోవైపు, రాష్ట్రంలో పరిస్థితులపై ఇప్పటికే అమిత్ షాకు సర్వే బృందాలు అత్యంత గోప్యంగా తమ నివేదికలను పంపుతున్నట్లు.. నివేదికలను బట్టి అమిత్ షా రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి సూచనలు చేస్తున్నట్లు సమాచారం. 'రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ మండలాల్లో మా పార్టీకి కేడర్ ఉన్నా సరైన నాయకత్వం లేదు. పార్టీ కార్యక్రమాల నిర్వహణతో పాటు ఎన్నికల సమయంలో ఈ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే, ప్రతీ నియోజకవర్గంలో ఒక ఇంచార్జి/సమన్వయకర్తకు బాధ్యతలు అప్పగించాలని మా అగ్రనాయకత్వాన్ని ఎప్పటి నుంచో కోరుతున్నాం. మా విజ్ఞప్తికి అనుగుణంగా అధినాయకత్వం పావులు కదుపుతోంది' అని బీజేపీ చేరికల కమిటీ సీనియర్ నేత ఒకరు వివరించారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలపై ప్రత్యేక దృష్టిఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలపై జాతీయ నాయకత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని మరో సీనియర్ నేత చెప్పారు. 'నల్ల గొండ, వరంగల్ జిల్లాల్లో సీనియర్ల చేరికలు పెద్ద ఎత్తున ఉండేలా చూడాలన్న ఆదేశాలున్నాయి.

ఈ ప్రభావం ఉమ్మడి ఖమ్మం జిల్లా పైనా పడుతుందని భావిస్తున్నాం' అని వివరించారు. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు తమకు కలిసి వస్తున్నాయన్నారు. ఈ రెండు జిల్లాల్లో ఏర్పాటు

## నల్లగొండ, ఖమ్మం జిల్లాలపై ప్రత్యేక దృష్టి

చేయనున్న భారీ బహిరంగ సభకు కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా అమిత్ షా పర్యటనలు ఉండవచ్చని బిజెపి వర్గాలు వెల్లడిస్తున్నాయి. వివిధ పార్టీల్లో అసమ్మతితో ఉన్న నేతలు మరికొందరు రిటైర్డు ఐఎఎస్‌లు, ఐపీఎస్‌లు కూడా అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరే అవకాశం ఉందని పార్టీ చేరికల కమిటీ కన్వీనర్ ఈటల రాజేందర్ తెలిపారు. 'బీజేపీలో చేరికలు ఇప్పుడొక సాధారణ ప్రక్రియగా మారింది' అని ఆయన వ్యాఖ్యానించారు.

## సంపాదకీయం

# ఫ్యాలెస్ ఫర్ సేల్
## ప్రత్యేకతలు తెలుసుకోవాల్సిందే!

ప్రస్తుతం దుబాయ్ లో ఒక భవనం అమ్మకం ఆన్ లైన్ వేదికగా హాట్ టాపిక్ గా మారింది. కారణం... అద్భుతమైన భవనం ప్రస్తుతం దుబాయ్ లో అమ్మకానికి అందుబాటులో ఉంది. ఇది విలాసవంతమైన ఆస్తులను ఎక్కువగా కోరుకునే నగరంలో అత్యంత ఖరీదైన ఇల్లుగా మారింది. అయితే ఈ ప్యాలెస్ ప్రత్యేకతలు ఏమిటి ధర ఎంత అంటారా? పదండి ముందుకు వెళ్దాం.. దుబాయ్ లోని ఎమిరేట్స్ హిల్స్ పరిసరాల్లో ఉన్న ఈ భవనం 60000 చదరపు అడుగుల ఇండోర్ స్థలంలో విస్తరించి ఉంది. అయితే ఇందులో ఐదు బెడ్ రూమ్ లు మాత్రమే ఉండటం గమనార్హం. కాకపొతే ప్రైమరీ బెడ్ రూమ్ మాత్రమే 4000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండటం గమనించాలి. అంటే ఈ ఒక్క బెడ్ రూం స్థలంలోనే చాలా ఇళ్లు కట్టెయ్యొచ్చన్నమాట. ఈ ప్యాలెస్ గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం డైనింగ్ కి ఎంటర్ టైన్ మెంట్ కి అంకితం చేయబడింది. వీటితో పాటు 15-కార్ల గ్యారేజ్ ఇండోర్ - అవుట్ డోర్ స్విమ్మింగ్ ఫూల్స్ తో పాటు భారీ అక్వేరియం ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. వీటితోపాటు ప్రత్యేకంగా ఒక సబ్ స్టేషన్ కూడా ఉంది. గోల్ఫ్ కోర్స్ కు ఎదురుగా గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న ఈ భవనం ఉంది. "మార్బుల్ ప్యాలెస్" గా పిలువబడే ఈ ప్యాలెస్ ను 80 మిలియన్ 100 మిలియన్ దిర్హామ్ ల విలువైన ఇటాలియన్ రాయిని ఉపయోగించి నిర్మించారు. దీని నిర్మాణానికి జస్ట్ 12 సంవత్సరాలు పట్టింది. ఇందులో సుమారు 9 నెలల పాటు తొమ్మిది నెలల సమయం 70 మంది నైపుణ్యం కలిగిన కార్మికులు 700000 బంగారు రేకులను పొదగడానికే సరిపోయింది. ఇక ఈ భవన యజమానికి ఉన్న ఆర్ట్ కలెక్షన్ అలవాటు వల్ల సుమారు 400 కళాకృతులు ఈ భవనంలో స్పెషల్ అట్రాక్షన్ గా ఉన్నాయి. వీటిలో మరింత ప్రధానంగా 19వ మరియు 20వ శతాబ్దాల నాటి విగ్రహాలు పెయింటింగ్ లు ఉన్నాయి. ఇక 2020 చివరి నుండి దుబాయ్ ప్రాపర్టీ మార్కెట్ అసాధారణమైన పెరుగుదలను ఎదుర్కొంటోంది. కోవిడ్-19 మహమ్మారి సమయంలో కూడా ఇది తన విలువను కాపాడుకుంటూ వచ్చింది. అవును... కోవిడ్ మహమ్మారిని దుబాయ్ సమర్థవంతంగా నిర్వహించడం వల్ల నగరం మరింత వేగంగా తిరిగి కోలుకోగలిగింది. ఆ సమయంలో సింగపూర్ హాంకాంగ్ వంటి ప్రదేశాల నుండి మకాం మార్చిన వ్యక్తులను ఆకర్షించించడంలో దుబాయ్ బాగా సక్సెస్ అవ్వగా... తాజాగా రష్యా - ఉక్రెయిన్ ల మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం వల్ల దుబాయ్ లో రియల్ ఎస్టేట్ కు పరోక్షంగా కలిసివచ్చింది. ఈ క్రమంలో ఈ మధ్యకాలంలో దుబాయ్ రియల్ ఎస్టేట్ మార్కెట్ లో ఇటీవలి మెగా-డీల్స్ లో 125 మిలియన్ దిర్హామ్ లకు ఖాళీ బీచ్ ఫ్రంట్ ప్లాట్ ను విక్రయించడం అనంతరం 420 మిలియన్ దిర్హామ్ లకు పెర్షియన్ గల్ఫ్ లో పెంట్ హౌస్ కొనుగోలు చేయడం రికార్డులుగా ఉండగా.. ఈ తాజా మార్బుల్ ప్యాలెస్ కి అతిసమీపంలో 12500 దిర్హామ్ లకు ఎమిరేట్స్ హిల్స్ లోని ఇతర ప్రాపర్టీలు ఉండటం గమనార్హం. కునాల్ సింగ్ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా కేవలం ఐదు నుండి పది మంది కొనుగోలుదారులు మాత్రమే ఈ భవనం ప్రత్యేక సౌందర్యం పట్ల ఆసక్తిని కలిగి ఉంటారని తెలుస్తుంది. ఇక గత మూడు వారాల్లో ఇద్దరు వ్యక్తులు మాత్రమే ఈ భవనాన్ని సందర్శించారు. వారిలో ఒకరు ఉజ్బెక్ వ్యక్తి కాగా ఇంకొకరు ఎమిరేట్స్ హిల్స్లో ఇప్పటికే మూడు ఆస్తులను కలిగి ఉన్న భారతీయ క్లయింట్ కావడం గమనార్హం. మార్బుల్ ప్యాలెస్ అనేది వారి సంపదను ప్రదర్శించడానికి ఉన్నత వ్యక్తులు రాజకీయ నాయకులను వంటి వారిని అలరించాలనుకునే కొనుగోలుదారులను ఆకర్షిస్తుంది. అంటే.. వినోద ప్రయోజనాల కోసం ఒబామాలు షేక్ ల వంటి ప్రముఖ వ్యక్తులను ఆహ్వానించడానికి అవసరమైన ప్రవసీని ప్రత్యేకతలను ఈ ప్యాలెస్ అందిస్తుందన్న మాట. భవనం యొక్క ప్రాథమిక సూట్ లో స్త్రీ పురుషులకు ప్రత్యేక బాత్ రూంస్ ఉన్నాయి. రెండవ అతిపెద్ద బెడ్ రూమ్ సూట్ 2500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఇక అతిథి గదులు ఒక్కొక్కటి 1000 చదరపు అడుగుల పరిమాణంలో ఉంటాయి. అతిథి గదుల్లో ఒకటి ప్రస్తుతం వైన్ నిల్వ చేసే ప్రదేశంగా మార్చబడింది. వీటితో పాటు అదనంగా 12 స్టాఫ్ రూమ్ లు 25 మంది సిబ్బంది కోసం రెండు బ్యాంక్ వాల్ట్ లు ఉన్నాయి. ఇంత చెప్పిన తర్వాత దీని ధర చెప్పకపోతే అస్సలు బాగోదు కాబట్టి... దీని ధర 750 మిలియన్ దిర్హామ్ లు అంటే.. ఇండియన్ కరెన్సీలో 1675 కోట్ల రూపాయలు అన్నమాట. ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే... ఈ "మార్బుల్ ప్యాలెస్" యజమాని తన విడాకుల తర్వాత తనకోసం దీనిని నిర్మించుకున్నాడు. ప్రస్తుతం అక్కడ ఒంటరిగా నివసిస్తున్నాడు.

# దోస్త్ కు అవాంతరాలు



ఖమ్మం : తెలంగాణ రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు గానూ ఎప్పటి లాగే ఈసంవత్సరం కూడా ఇంటర్ ఫలితాలు విడుదలైన వెంటనే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి దోస్త్ నోటిఫికేషన్ విడుదల చేసింది. జులై 1నుంచి 30తేదీ వరకు మొదటి విడతగా ప్రవేశాల ప్రక్రియ చేపట్టింది. ఈనెల 6న మొదటి విడత సీట్ల కేటాయింపు చేసింది. మొదటి విడత ప్రవేశాలకు నెల రోజులు సమయం ఇచ్చినప్పటికీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విద్యార్థుల రిజిస్ట్రేషన్ ఆశించిన స్థాయిలో లేకపోవటం గమనార్హం. ఎంసెట్ ఇంజినీరింగ్, మెడికల్, నీట్ ప్రైవేశాల ప్రభావం మొదటి విడత ప్రవేశాలపై స్పష్టంగా కన్పిస్తోంది. చాలా మంది విద్యార్థులు ఈప్రవేశాల ఫలితాలు వచ్చిన తర్వాత రెండో విడతలో ఎక్కువ మంది చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు మొదటి విడత దరఖాస్తు చేసుకున్న ప్రవేశాలను బట్టి ఈవిషయం స్పష్టమవుతోంది.

బీఏపై ఆసక్తి

ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొత్తం 1740 సీట్లకు గానూ మొదటి విడతలో 1134మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా బీఏలో 120 సీట్లకు గానూ అదేసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. బీకాంలో 360 సీట్లకు 333, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 300 సీట్లకు గానూ 230, బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్‌లో 420కి గానూ 220 మంది దరఖాస్తు చేశారు. బీబీఏలో 60సీట్లకు గానూ 19మంది దరఖాస్తు చేశారు.

ఆకర్షించని కొత్త కోర్సులు

రాష్ట్ర ఉన్నతవిద్యా మండలి అనేక రకాల కొత్త కోర్సులు ప్రవేశపెట్టినప్పటికీ వాటిలో చేరేందుకు విద్యార్థులు పెద్దగా ఆసక్తి చూపలేదు. గత విద్యా సంవత్సరం బీఎస్సీ విభాగంలో డేటా సైన్స్, బీకామ్ విభాగంలో బిజినెస్ అనలటిక్స్ వంటి కొత్త కోర్సులను ప్రవేశపెట్టినప్పటికీ విద్యార్థులు మాత్రం పాత కోర్సుల్లో చేరేందుకే పోటీపడ్డారు. కొత్త కోర్సులకు పుస్తకాలు అందుబాటులో ఉండవు. నైపుణ్యాలు ఉన్న అధ్యాపకులు తక్కువగా ఉండటం, పాత పద్ధతుల్లోనే కోర్సులను నిర్వహిస్తుండటంతో కొత్త కోర్సుల గురించి పట్టించుకున్నట్లు లేదు.

కారణాలు ఇవీ...

లిమొదటి విడతలో నెల రోజుల సమయం ఇచ్చినా, జిల్లాలో ఏకధాటిగా భారీ వర్షాలు ఉండటంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సరిగా కొనసాగలేదు.

లి కరోనా కారణంగా రెండేళ్ల క్రితం పదో తరగతి విద్యార్థులందరినీ ప్రభుత్వం ఉత్తీర్ణులు చేసింది. పాఠశాల ఇచ్చిన ఇంటర్నల్ మార్కుల ఆధారంగా వారికి గ్రేడ్ పాయింట్లు కేటాయించారు. చాలా మందికి ఎక్కువగా 9 నుంచి 10 గ్రేడ్ పాయింట్లు లభించాయి.

లి ఎంసెట్ ఇంజినీరింగ్, మెడికల్ కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాతనే డిగ్రీ కోర్సుల్లో చేరాలని విద్యార్థులు భావిస్తుండటంతో రిజిస్ట్రేషన్లు తగ్గినట్లు తెలుస్తోంది.

లి మహిళా డిగ్రీ కళాశాలలో లైఫ్ సైన్స్‌పై ఆసక్తి: ఇక్కడ మొత్తం 540 సీట్లకు గానూ 178మంది దరఖాస్తు చేసుకున్నారు. బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 120 సీట్లకు 67 మంది దరఖాస్తు చేశారు. బీకాం కంప్యూటర్ సైన్స్‌లో 120 సీట్లకు 44, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 120 సీట్లకు 27, బీఏలో 120 సీట్లకు 26మంది దరఖాస్తు చేసుకున్నారు.

లినేలకొండపల్లిలో బీఎస్సీ(బీజడ్‌సీ) వైపు చూపు: ఇక్కడ మొత్తం 300 సీట్లకు గానూ 49మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా 17మంది బీఎస్సీ బీజడ్‌సీలోనూ, 11మంది బీకాంలోనూ, 8మంది బీఎస్సీ ఎంపీసీలో, 13మంది బీఏ, ఇతర కోర్సుల్లో దరఖాస్తు చేసుకున్నారు.

లి సత్తుపల్లిలో బీఎస్సీకి అధికం: ఇక్కడి కళాశాలలో మొత్తం 160సీట్లకు గానూ 123మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో బీఏలో 60సీట్లకు 16, బీకాం కంప్యూటర్స్ 180కి 39, బీఎస్సీ లైఫ్ సైన్స్ 120కి 46, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌కు 120కి కేవలం నలుగురు, బీఏ తెలుగు మీడియంలో 180కి 18మంది దరఖాస్తు చేసుకున్నారు.

లి మధిర ఆర్ట్స్, కామర్స్‌దే: ఇక్కడ మొత్తం 120 సీట్లకు గానూ 33మంది దరఖాస్తు చేసుకున్నారు. బీఏలో మొత్తం 60 సీట్లకు గానూ 24మంది, కామర్స్‌లో 60 సీట్లకు గానూ 9మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈకళాశాలలో బీఏ, బీకాం కోర్సులు మాత్రమే ఉన్నాయి. సైన్స్ కోర్సులు లేవు.

# వజ్ర సంకల్పం..ప్రగతి పయనం

ఖమ్మం :భద్రాచలం మన్యంలో గిరిజనుల జీవనంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రధాన రంగాలలో ప్రగతి స్పష్టంగా కనిపిస్తోంది. ఇంకా చేయాల్సినవి మిగిలి ఉన్నా నాడు-నేడు అని చెప్పుకునే స్థాయిలో ప్రగతి సాధించారు. 1947కు ముందు శంకరగిరి మాన్యాలుగా మన్యానికి పేరుంది. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్డ్‌లో పొందుపర్చిన ప్రత్యేక ప్రాంతమే భద్రాచలం మన్యం. స్వాతంత్ర్యం రాక ముందు నుంచి చట్టాలు ఉండగా ఆ తర్వాత ఎన్నో మార్పులు చేర్పులకు గురయ్యాయి.

ఉమ్మడి రాష్ట్రంలోని వరరామచంద్రాపురం-కూనవరం మండలాల మధ్యలో శబరి వంతెన దాదాపు రెండు దశాబ్దాల క్రితం నిర్మించారు. అంతకు ముందు చిన్నపాటి వరదొస్తే ఎక్కడి వారు అక్కడ ఆగాల్సిన పరిస్థితి. భద్రాచలం-సారపాక మధ్య గోదావరిలో 1964 వరకు నాటు పడవలే ప్రయాణ సాధనాలు. అప్పట్లో పడవలు మునిగిపోయి 300 మంది చనిపోవడంతో ఇక్కడ వారధి కట్టారు. ఇదేచోట రెండో వంతెనను రూ.70 కోట్లతో ఇప్పుడు నిర్మిస్తున్నారు. వాజేడు వద్ద ఈ దశాబ్దంలో వంతెన నిర్మించడంతో హైదరాబాద్‌కు రాకపోకలు పెరిగాయి. చర్ల, దుమ్ముగూడెం మండలాలకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సరిహద్దుగా ఉండటంతో మావోయిస్టుల ప్రభావిత గ్రామాలు ఉండేవి. ఎల్‌డబ్ల్యుఈ నిధులతో పదేళ్ల క్రితం రూ.వందల కోట్లతో మౌలిక సదుపాయాలను కల్పించారు. విద్యుత్తు సదుపాయం లేని ప్రాంతాలను గుర్తించి వెలుగులు అందిస్తున్నారు. తాలిపేరు జలాశయంతో సాగునీటి కల్పన చేశారు. జీసీసీ నుంచి చౌక దుకాణాలను ఏర్పాటు చేశారు.

విద్యా వ్యవస్థలో మార్పు

1947 ప్రాంతంలో మన్యంలో చదువుకున్న గిరిజనులు స్వల్పం. వీరి అక్షరాస్యత శాతం 10 లోపేనని ఆ సంఘాలు అంటుంటాయి. తర్వాత వచ్చిన ఉద్యమాలతో పాలకుల్లో మార్పు వచ్చి గిరి కూనలను బడిబాట పట్టించారు. కోయ, బంజార వంటి మాతృ భాషల్లో బోధిస్తున్నారు. 2011 లెక్కల ప్రకారం మన్యంలో 47.33 శాతం గిరిజన అక్షరాస్యత ఉండగా ఇందులో మగవారు 54.71. ఆడవారు 40.04 శాతం మాత్రమే. కొత్త లెక్కలను పరిగణలోకి తీసుకుంటే కొంత పెరిగింది. ఐటీడీఏ పరిధిలో ఒకటి నుంచి పీజీ వరకు సుమారు 40 వేల మంది చదువుతున్నారు.

జీవో నంబరు 3

మన్యం దిశను మార్చిన అధికారిక ఉత్తర్వు ఇది. 2000 సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చింది. మన్యంలోని గిరిజన అభ్యర్థులకు ఉద్యోగాలను కేటాయించాలన్నది దీని ఉద్దేశం. అప్పటి నుంచి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సుమారు 20 వేల మంది ఉద్యోగాలను పొందారు. ఈ జీవోను గిరిజనేతరులు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల సుప్రీం కోర్టు ఈ జీవోను రద్దు చేసింది. ఇరు ప్రభుత్వాల తరఫున న్యాయస్థానాలను ఆశ్రయించారు.

వైద్యం విస్తరిస్తోంది

ఒకప్పుడు మలేరియా తరుణం వచ్చిందంటే మన్యం మంచాన పడ్డట్లే. యువత చైతన్యంతో వైద్య బృందాలు అడవులకు వెళ్లి వైద్యం చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత పీహెచ్‌సీలను, ఆరోగ్య ఉప కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. సురక్షిత కాన్పులను పెంచి తల్లీ పిల్లల ఆరోగ్యంపై చైతన్యం కల్పించారు. మలేరియా విభాగం ద్వారా ప్రభావిత గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేసి దోమ తెరలందిస్తున్నారు. సంక్షేమ పథకాలుఅప్పటికీ ఇప్పటికీ ఎన్నో మార్పులు వచ్చినప్పటికీ ట్రైకార్ పాత్ర కీలకం. పాడిపరిశ్రమ, కిరాణా వంటి వాటికి రుణాలు అందిస్తున్నారు. వైటీసీ ద్వారా యువతకు ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాల నిమిత్తం శిక్షణ ఇస్తున్నారు. సీఎం గిరి వికాసం ద్వారా వ్యవసాయ యోగ్యత కల్పిస్తున్నారు. 1143 అభివృద్ధి పనులకు రూ.582.19 కోట్లను కేటాయించారు. ఇంజినీర్ విభాగం నుంచి ఇంకొన్ని ప్రతిపాదన దశలో ఉన్నాయి. ఇంకా చేయాల్సింది ఉంది.

# పరిహారమే అడిగితే పరిహాసం

భద్రాచలం : 'కటిక పేదరికం అనుభవిస్తున్నా.. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి నాది. కుటుంబాన్ని పోషించలేక భర్త ఊరొదిలి వెళ్లిపోయాడు. ముగ్గురు పిల్లల్లో చిన్న బిడ్డకు పదేళ్లు వచ్చినా నడవలేదు.. నిలబడలేదు. వెన్నుపూస సమస్యకు చికిత్స చేయించేందుకు చేతిలో చిల్లిగవ్వ లేదు. పాప వైకల్యంతో బాధ పడుతోంది. నేను ఒంటరి మహిళగా ఉన్నప్పటికీ పింఛన్ రావడం లేదు. చుట్టు పక్కల ఇళ్లలో అంట్లు తోమి... కూలీ పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ఇంత దయనీయంగా రోజులు వెళ్లదీస్తుంటే ఇటీవల వచ్చిన వరదలకు కట్టుబట్టలతో మిగిలాం. అద్దెకు ఉండే ఇల్లు పూర్తిగా మునిగి దుస్తులు, దుప్పట్లు, వంట గిన్నెలు కొట్టుకుపోయాయి. అయినా నాకింకా రూ.10 వేలు అందలేదని' వాపోయింది భద్రాచలం పట్టణం సుభాష్‌నగర్ కాలనీకి చెందిన వరద బాధితురాలు బి.సుభద్ర. ఈమెకు బ్యాంకు ఖాతా లేకపోవడంతో చుట్టుపక్కల వారు డిపాజిట్ నగదు చెల్లించి ఖాతా ప్రారంభించారు. అన్ని వివరాలు రాసుకున్నప్పటికీ పైసా సాయం అందలేదని వాపోతోంది.

సమన్వయ లోపంతో గందరగోళం

నష్ట పరిహారం ఎందుకు రాలేదో తెలుసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే కసురుకుంటున్నారని బాధితులు కన్నీరు పెట్టుకునే తీరు చూస్తే కడుపు తరుక్కుపోతోంది. కళ్లకు కట్టినట్లు బాధ కనిపిస్తున్నా అధికారులు కనీసం కనికరం చూపడం లేదని రోదిస్తున్నారు. ఇలప్రభుత్వ సాయం అందక లబోదిబోమంటున్న గోదావరి వరద బాధితుల్లుంటి వారు 100 మందికి పైగా పరిహారం అందక పడిగాపులు కాస్తున్నారు. కదిపితే చాలు కన్నీటి పర్యంతమవుతున్నారు. అయ్యప్పకాలనీకి చెందిన వృద్ధురాలు లాల్‌బీ, అదే కాలనీకి చెందిన సత్యవేణి తమ ఇళ్లు మునిగినా పరిహారం రాలేదని వాపోతున్నారు. శిల్పినగర్, రామాలయ పరిసరాలు, కొత్తకాలనీ, శాంతినగర్, సీఆర్‌పీఎఫ్ క్యాంపు వెనుక వైపు కాలనీలను వరద ముంచెత్తింది. 1,428 కుటుంబాలతో జాబితా తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించగా కొంతమంది ఖాతాలలో పరిహారం జమయింది. మిగతా వారు రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కనీస స్పందన కరవైంది. తాము తీవ్రంగా నష్టపోయామని ఇప్పటికైనా ఆదుకుంటారా లేదా అంటు నిలదీస్తున్నారు. అర్హుల జాబితాను పంపడం వరకే తమ పని అని ఎంతమందికి జమ అయ్యాయో తెలియదని సమన్వయ లోపాన్ని అధికారులు బట్టబయలు చేస్తున్నారు.

# కాలుష్యం కమ్మేసింది..

గోదావరిఖని : ఇక్కడ ఉపరితల గనిలో కనిపించకుండా కమ్మేసిన పొగ దుమ్ము బ్లాస్టింగ్‌తో ఏర్పడింది.. సింగరేణి ఉపరితల గనుల్లో నిత్యం కనిపించే దృశ్యాలివి.. తెలియని వారికి ఇక్కడ భూకంపం వచ్చిందా అన్న భయం కలుగుతుంది.. రామగుండం ప్రాంతంలోని నాలుగు ఉపరితల గనుల్లో రోజుకు లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తి చేపడుతారు. నిత్యం పేలుడు పదార్థాలు వినియోగించి బొగ్గు పొరలను పేల్చుతారు.

ఇక్కడ నిర్మిస్తున్నది ఎఫ్‌జీడీ చిమ్నీ.. ఎన్టీపీసీ సంస్థ సల్ఫర్‌డైఆక్సైడ్ బయటకు రాకుండా నియంత్రించేందుకు ఫ్లూ గ్యాస్ డీమినరలైజేషన్(ఎఫ్‌జీడీ) నిర్మిస్తోంది. ఇది రెండేళ్ల క్రితమే పూర్తిచేయాలి. కానీ, 2024 నాటికి పూర్తిచేసే అవకాశం ఉంది. అంటే అప్పటివరకు బొగ్గు మండించడం ద్వారా వెలువడే సల్ఫర్‌డైఆక్సైడ్ వాయువు గాలిలో కలవాల్సిందే.. ఎన్టీపీసీ ఉత్పత్తి చేస్తున్న 2,600 మెగావాట్ల విద్యుత్తు కోసం రోజుకు 35 వేల టన్నుల బొగ్గును మండిస్తోంది. ఏడు యూనిట్ల చిమ్నీల ద్వారా సల్ఫర్‌డైఆక్సైడ్ బయటకు వస్తోంది.ఆర్ఎఫ్‌సీఎల్ రసాయన వ్యర్థాలు నేరుగా గోదావరి నదిలో కలుస్తున్నాయి.. రోజుకు 3,850 టన్నుల యూరియా, 2,200 అమ్మోనియా ఉత్పత్తి చేస్తున్న ఆర్ఎఫ్‌సీఎల్ రోజుకు 30,500 కిలోలీటర్ల నీటిని వినియోగిస్తుంది.. యూరియా, అమ్మోనియా ఉత్పత్తికి వినియోగించిన నీటిని శుద్ధి చేసి బయటకు వదలాల్సి ఉండగా, నేరుగా గోదావరినదిలోకి మళ్లించింది. దీంతో రోజుకు 840 కిలోలీటర్ల వ్యర్థాలతో కూడిన నీరు నదిలో కలుస్తోంది. దీంతో పాటు అమ్మోనియా గ్యాస్ అప్పుడప్పుడూ విడుదలవుతోంది. ముక్కుపుటాలు అదిరే వాయువును పీల్చుకోలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఓవైపు రసాయనాలు తయారు చేసే కార్ఖానా.. మరోవైపు విద్యుత్తును ఉత్పత్తి చేసే సంస్థ.. ఇంకోవైపు బొగ్గును వెలికితీసే పరిశ్రమ.. సహజ సంపదను వెలికితీయడం ద్వారా పారిశ్రామికంగా ప్రగతి సాధిస్తోంది. దాని వెంటే ప్రాణవాయువు కరవవుతోంది. రసాయన వ్యర్థాలు.. సల్ఫర్‌డైఆక్సైడ్.. అమ్మోనియా విషవాయులు గాలిలో కలిసి కలుషితం చేస్తున్నాయి. విద్యుత్తు ఉత్పిత్తి చేసే ఎన్టీపీసీతో పాటు రామగుండం బి-థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచీ కాలుష్య కారకాలు వెలువడుతున్నాయి. ఫలితంగా రామగుండం ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు కాలుష్యం బారినపడి అనారోగ్యం పాలవుతున్నారు. దీన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాల్సిన కాలుష్య నియంత్రణ మండలి కేవలం నోటీసులు ఇచ్చే వరకే పరిమితమవుతోంది.రామగుండం పారిశ్రామిక ప్రాంతం చుట్టూ పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. 93 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న రామగుండం ప్రాంతంలో 4 లక్షల జనాభా జీవిస్తున్నారు. నగరం చుట్టూ సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, బి-థర్మల్ కేంద్రాలు సరిహద్దుగా ఉన్నాయి. మరోవైపు గోదావరి సరిహద్దుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతం విస్తరించి ఉంది. బొగ్గు, బూడిదతో పాటు ధూళి కణాలు.. శబ్ధ, వాయు, జల కాలుష్యాలు ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి.

చుట్టూ పరిశ్రమలు.. మధ్యలో ప్రజలు : - రవిదాస్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి

నిరంతరం తనిఖీ చేస్తున్నాం. కాలుష్యం అధికంగా విడుదల చేసే పరిశ్రమలకు నోటీసులు జారీ చేస్తున్నాం. నియంత్రించకుంటే పరిశ్రమ మూసివేస్తామని హెచ్చరిస్తున్నాం. ఆన్‌లైన్ మానిటరింగ్ ద్వారా నిత్యం గాలి నాణ్యతను పరిశీలిస్తున్నాం. వాయు కాలుష్యం గుర్తిస్తే వెంటనే ఆ పరిశ్రమ అధికారులకు నియంత్రించాలని ఆదేశిస్తున్నాం. ఎన్టీపీసీ సంస్థ సల్ఫర్‌డైఆక్సైడ్ నియంత్రణకు ఎఫ్‌జీడీ నిర్మిస్తోంది.. ఆర్ఎఫ్‌సీఎల్ ఇటీవల జారీ చేసిన నోటీసు మేరకు సమయం కోరింది. గడువులోగా నియంత్రణ చర్యలు తీసుకోకుంటే మరోసారి నోటీసులు జారీచేసి పనులు నిలిపివేయిస్తాం. సింగరేణి సంస్థ చేపడుతున్న బొగ్గు ఉత్పత్తి ద్వారా వెలువడే కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించాం.

నోటీసులు జారీ చేస్తున్నాం : జాతీయ సర్వేలో తేలిన అంశాలు..

ఇటీవల జాతీయ పర్యావరణ సంస్థ నిర్వహించిన సర్వేలో రామగుండంలో గాలి కాలుష్యం ఎక్కువగా ఉందని వెల్లడించింది. గాలిలో సల్ఫర్‌డైఆక్సైడ్‌తో పాటు నైట్రోజన్ స్థాయిలు ఎక్కువగా ఉన్నట్లు ప్రకటించింది. గాలిలో 80 ఎంజీపీఎం క్యూబిక్ మీటర్లు ఉండాల్సింది 600 ఎంజీపీఎం క్యూబిక్ మీటర్ల మేర ఉంటున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పరీక్షల్లో తేలుతోంది. అదే విధంగా నైట్రోజన్ వాయువు అధికంగానే గాలిలో కలుస్తోంది. వీటితో పాటు పరిశ్రమలు విడుదల చేసే బూడిద, బొగ్గు దూళితో గాలి కలుషితమవుతోంది. ఇటీవల గాలిలో 1245 ఎంజీ, నైట్రోజన్ ఆక్సైడ్ 579 ఎంజీ ఎన్ఎం3 స్థాయిల్లో నమోదయ్యాయి. ఎన్టీపీసీ సంస్థ రాత్రి వేళల్లో చిమ్నిలోంచి సల్ఫర్‌డైఆక్సైడ్‌ను విడుదల చేస్తోంది. అదేవిధంగా ఆర్ఎఫ్‌సీఎల్ అమ్మోనియా లీకేజీ పేరుతో విడుదల చేస్తోంది. దీంతో విషవాయువులు గాలిలో కలిసిపోతున్నాయి.

# ఎత్తిపోతలు.. వరదపాలు

కడెం ఎగువన విస్తృతంగా కురిసిన వర్షాలతో జగిత్యాల జిల్లాలో ఎప్పుడూ లేనంతగా తీర ప్రాంతాల్లో నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. నియంత్రికలు, స్తంభాలు, మోటార్లతో పాటు గోదావరి తీరాన ఎత్తిపోతల వ్యవస్థ కుప్పకూలడంతో రైతాంగం ఆందోళన చెందుతుంది. ధర్మపురి మండలంలో దొంతాపూర్, మగ్గిడి, జైన, రాజారం, తిమ్మాపూర్, రాయపట్నం తీరాల్లో బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు ఎత్తిపోతలను నిర్మించారు. నిర్మాణాల్లో ఆది నుంచి ఒడిదొడుకులు నెలకొనగా.. తాజాగా వరద రూపంలో తీరని నష్టం కలిగింది. పథకాలకు సంబంధించి నియంత్రికలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒక్కో పథకం 800 కేవీ సామర్థ్యం గల రెండు నియంత్రికలుంటాయి. వరదతో పూర్తిగా పాడయ్యాయి. బ్రేకర్లు, సీటీపీటీలు, ఎనర్జీ మోటార్లతో పాటు చుట్టూ ఫెన్సింగ్ దెబ్బతింది. కేవలం ఆరు బయట ఉన్న నియంత్రికలకు సంబంధించిన



మరమ్మతులకు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇలా ఆరు పథకాల కోసం సుమారు రూ.కోటి 20 లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. లోపల మోటార్లు, స్టార్టర్లు కూడా పూర్తిగా నానాయి. మోటార్లను ఆరబెట్టి వార్నిష్ చేయాల్సి ఉంటుంది.. వీటి మరమ్మతులకు ఒక్కో దానికి లక్షలాది రూపాయలు ఖర్చువుతుంది.తీవ్ర నష్టం జరిగింది- ఎర్ర మోహన్, ఎత్తిపోతల పథకం ఛైర్మన్, దొంతాపూర్‌కడెం జలాశయం వరదలతో తీవ్ర నష్టం జరిగింది. పొలాలు చేసుకునే సమయంలో ఎత్తిపోతలు కుప్పకూలడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. అధికారుల పూర్తి సహాయంతో పంటల సాగుకు ఇబ్బందులు లేకుండా చూస్తారని ఆశిస్తున్నాం. నష్టాన్ని అంచనా వేస్తున్నాం- ధర్మకుమార్, నీటి పారుదల శాఖ, డీఈవరదలతో ఎత్తిపోతల పథకాలు పూర్తిగా దెబ్బతినడంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనా వేస్తున్నాం. పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటాం.

# మునుగుతున్నా.. మేల్కొనరా?

జగిత్యాల :ఏటా వర్షాకాలంలో పట్టణాల్లోని కాలనీలను వరద ముంచెత్తుతోంది. వరద కాలువలు ఆక్రమణకు గురికావడం.. పిచ్చిమొక్కలు, పూడిక పేరుకుపోవడంతో నీరు ముందుకు సాగని పరిస్థితి. చెరువులు, కుంటలను ఆక్రమించి భవనాలు నిర్మించడం.. లోతట్టు ప్రాంతాల్లో వరద వెళ్లేందుకు కాలువలు లేకపోవడంతో కాలనీలు నీట మునుగుతున్నాయి. ముందస్తుగా కాలువలను శుభ్రం చేసుకుంటే రాబోయే వర్షాకాలంలో ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పట్టణాల్లో బృందం పరిశీలించింది. ఆ వివరాలు..

**రోజుల తరబడి ప్రవాహం...**

కోరుట్ల పట్టణంలోని బీలాల్‌పుర, ఆదర్శనగర్, ప్రకాశంరోడ్, ఝూన్సీరోడ్, కల్లూర్‌రోడ్, తాళ్ల చెరువు కింది ప్రాంతంలో ఏటా వర్షాకాలంలో వరద నీరు రోజుల తరబడి ప్రవహిస్తుంది. కాలనీల్లో నీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పరిష్కారం చూపడంలో పాలకులు విఫలమవుతున్నారు. పట్టణ శివారులోని స్తంభాల చెరువు, మద్దుల చెరువు, తాళ్ల కింద సుమారు 3 కి.మీ పొడవున మట్టి, సిమెంట్ కాలువల్లో పిచ్చిమొక్కలు పెరిగి మురుగుతో నిండిపోయాయి. కంచరకుంట కాలువను రైతులు సుమారు 20 ఏళ్ల కిందట పూడ్చివేయడంతో ఏటా వర్షాకాలంలో మత్తడి దూకి ఆదర్శనగర్, ప్రకాశంరోడ్ జలమయం అవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్‌ను వివరణ కోరగా వర్షాకాలం సమీపిస్తున్నందున ప్రధాన మురుగు కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయించామని పేర్కొన్నారు.

**ప్రత్యామ్నాయ చర్యలు శూన్యం**

మిషన్ కాకతీయ పనుల్లో భాగంగా పెద్ద చెరువు మత్తడి ఎత్తు పెంచడంతో పరిసర ప్రాంతాలు గత కొన్ని సంవత్సరాలుగా తరచూ ముంపునకు గురవుతున్నాయి. పట్టణంలో ఏటా వర్షాకాలంలో పెద్ద చెరువు, బతుకమ్మ వాగు సమీపంలోని లోతట్టు ప్రాంతాలు, నాలుగు, ఐదో వార్డులోని బీమన్నవాడ పరిసరాలు, ఒకటి, రెండో వార్డులోని వీరాపూర్ రోడ్డులోని పలు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. లోలెవల్ వంతెనలు ఉండటంతో పట్టణానికి ఇతర గ్రామాలకు అనుసంధానం లేకుండా పోతుంది. రాయికల్ మైతాపూర్ మధ్యన ఉన్న వాగు, బతుకమ్మ వాగుపై నూతన వంతెన నిర్మాణాలు చేపడుతుండటంలో గ్రామాలకు రాకపోకలు ఇబ్బందులు లేకుండా కొనసాగనున్నాయి. ఈ విషయమై కమిషనర్ సంతోష్‌కుమార్‌ను వివరణ కోరగా వర్షాకాలంలో వరద నీరు ఇళ్లలోకి రాకుండా ఉండేందుకు ఇప్పటికే మురుగు కాల్వల్లో పూడిక తొలగించామని, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు జేసీబీ యంత్రంతో కచ్చా డ్రైన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

**ముందస్తు ఏర్పాట్లు కరవు..**

గతేడాది ధర్మపురిలో గోదావరినది వరద మహోగ్ర రూపం దాల్చడంతో పట్టణంలో జన జీవనం అస్తవ్యస్తమైంది. ఎగువ ప్రాంతాన గల కుమ్మరివాడ నుంచి బోయవాడ వరకు వరదలతో తీవ్ర ప్రభావాన్ని చూపింది. అయితే ఈసారి వరదలు వస్తే ఏమి చేయాలనే దానికి ఇప్పటి వరకు పుర, ఇరిగేషన్ శాఖలు ముందస్తు ప్రణాళికలను రూపొందించలేదు. ఇప్పటికీ వరద నివారణ చర్యల కోసం పురపాలికలో ఎలాంటి సమావేశాలు, ముందస్తు ఏర్పాట్లు చేయడం లేదు. హన్మాండ్ల గడ్డ మొత్తం గత వరదల సమయంలో కొట్టుకు పోయింది. దీంతో కొద్దిపాటి వరద వచ్చిదంటే వాగు నుంచి నేరుగా బ్రాహ్మణసంఘం ప్రాంతానికి చేరే అవకాశముంటుంది. ఈ విషయమై పుర కమిషనర్ సీహెచ్ రమేష్ మాట్లాడుతూ గతేడాది కడెం జలాశయం నీటితో ధర్మపురికి వరద ముప్పు వచ్చిందని, అయితే ముందస్తుగా ఇప్పటికే వరద నివారణపై ప్రణాళికలను రూపొందించామన్నారు. ఇరిగేషన్, పుర ఇంజినీర్లతో సమావేశం ఏర్పాటు చేసి వరద కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు.

**పురాతన కాలువలు కావడంతో..**

వర్షాకాలంలో ఏటా కాలనీల్లో వరదనీరు పోటెత్తి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పురాతన మురుగుకాల్వలు కావడంతో చిన్నపాటి వర్షానికి వరద కాలనీలను ముంచెత్తుతోంది. పట్టణంలోని చైతన్యనగర్, కూరగాయల మార్కెట్, కళానగర్, శివాజీనగర్, డీడీ.నగర్, కాశీబాగు తదితర ఏరియాల్లో ఏటా ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పట్టణంలో సుమారు మూడున్నర కి.మీ పెద్ద మురుగుకాల్వలను శుభ్రం చేస్తున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను వివరణ కోరగా ప్రస్తుతం పట్టణంలోని అత్యధికంగా వరద నీరు వచ్చే పెద్ద మురుగుకాల్వలలో చెత్తాచెదారం తొలగింపు పనులు చేపట్టామన్నారు. గతంలో పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వరుదనీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

**పేరుకుపోతున్న వ్యర్థాలు**

పట్టణంలో ఏటా వర్షాలకు దిగువ, లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు తప్పటంలేదు. మురుగుకాల్వలు నిండుకోవడం, వ్యర్థాలు పేరుకుపోయి నీరు బయటకు వెళ్లేమార్గంలేక చాలా ప్రాంతాలు జలమయమవుతున్నాయి. వర్షాలకు ముందుగానే పురపాలక సంఘం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాల్సి ఉన్నా ఇప్పటి వరకు నామమాత్రంగానే పనులు పూర్తి చేశారు. పట్టణంలో 16.20 కిలోమీటర్ల మేర వరదముప్పు కాల్వలున్నాయి. ఇందులో ప్రధానంగా సార్గమ్మవీధి, గడియారం, సరస్వతీనగర్, చిలుకవాడ, గోవిందుపల్లి, కండ్లపల్లి చెరువు, గాంధీనగర్, నాగేంద్రనగర్ తదితర కాలనీల్లో ఏటా వరద కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వల ఎత్తు, వెడల్పు పెంచి నూతన నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలకు పూనుకోవడంలేదు. ఈసారి కేవలం దగ్గులమ్మ గుడి వద్ద కాల్వను రూ.5 లక్షలతో మరమ్మతు చేస్తున్నారు. ఈసారి వరదముప్పు ఉన్న కాల్వల వ్యర్థాల తొలగింపునకు5 లక్షలను బల్దియా కేటాయించింది.

## కోరుట్ల బల్దియాకు రాష్ట్ర స్థాయి అవార్డులు

కోరుట్ల : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పట్టణ ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పురపాలక సంఘాలకు అవార్డులను ప్రకటించింది. ఇందులో కోరుట్ల పురపాలికకు రెండు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా అమలు చేయడం, ప్రజామరుగుదొడ్ల నిర్వహణ, హరితహారంలో భాగంగా సెంట్రల్ మీడియన్ ప్లాంటేషన్ కింద అవార్డులు కేటాయించారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరగనున్న అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పుర ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ అయాజ్ అవార్డులను అందుకోనున్నారు.

వెల్లివిరిసిన పచ్చదనం కోరుట్ల పట్టణంలో హరితహారంలో విస్తృతంగా మొక్కలు నాటడంతో పచ్చదనం సంతరించుకుంది. పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో సుమారు 4.5 కి.మీ పొడవునా అధునాతన డివైడర్లను నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. డివైడర్ల మధ్యలో మొక్కలు నాటి నిత్యం వాటికి నీటిని పట్టడంతో పచ్చదనంతో నిండిపోయింది. మొక్కలు భారీగా పెరగకుండా తరచూ కత్తిరింపు చర్యలు చేపట్టడంతో ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. సెంట్రల్ లైటింగ్, విద్యుత్తు స్తంభాలకు రంగు రంగుల ఎల్‌ఈడీ బల్బులను అమర్చడంతో రాత్రిపూట రహదారి అందంగా కనిపిస్తుంది. పురపాలికలోని 33 ప్రాంతాల్లో పట్టణ వనాలను ఏర్పాటు చేసి సుమారు 25 వేల మొక్కలను నాటించారు. వాటికి నిత్యం నీటిని పట్టడంతో అవి ఏపుగా పెరిగి చెట్లుగా వృద్ధి చెందాయి. ప్రభుత్వం హరితహారంలో కోరుట్ల పురపాలికకు అవార్డు ప్రకటించడంతో పాలకవర్గం హర్షం ప్రకటించింది.

# బడినే కాదు.. బస్సునూ చూడండి



వరంగల్ :నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైంది. తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి విద్యా ప్రమాణాలు ఉన్న పాఠశాలలో చేర్పించాలని చూస్తారు. అదే సమయంలో సరైన రవాణా వసతి ఉందా లేదా తెలుసుకోవాలి. విద్యార్థులను క్షేమంగా ఇంటికి చేర్చే విద్యాసంస్థల బస్సు ప్రమాణాలు, అనుభవజ్ఞులైన డ్రైవర్లు, నిర్వహణపై దృష్టి సారించాలి.

మెట్లు: ఎక్కే తొలి మెట్టు విద్యార్థులకు అనువుగా 325 ఎంఎం ఎత్తులో ఉండాలి. లేకుంటే వారికి అనువుగా తాత్కాలిక బల్ల ఏర్పాటు చేయాలి. లేదా అటెండర్ విద్యార్థులను విధిగా బస్సులోకి ఎక్కించడం, దించటం చేయాలి. చేతితో పట్టుకొని సులువుగా ఎక్కేందుకు, దిగేందుకు రేలింగ్ రాడ్‌లు ఉండాలి.

అద్దాలు:- లోపలి భాగంలో, డ్రైవర్‌కు ఇరుపక్కలా బయటి భాగంలో అద్దాలను అమర్చాలి. ప్రయాణ సమయంలో ప్రతి క్షణం విద్యార్థులు, ఇరుపక్కలా వస్తున్న వాహనాల తీరును డ్రైవర్ ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి.

వాహనం కండిషన్: హెడ్‌లైట్లు, వైపర్, విద్యార్థులు కూర్చునేందుకు అనువుగా సీట్లు ఉన్నాయా లేవా చూసుకోవాలి.

**టీఎస్ స్కూల్ బస్సు యాప్..**

విద్యాసంస్థల బస్సు పూర్తి వివరాలను తెలుసుకునేందుకు రవాణా శాఖ ఈ యాప్‌ను అందుబాటులో ఉంచింది. ఇందులో బస్సు నెంబర్ ఎంటర్ చేయగానే బస్సు, యాజమాన్యం, డ్రైవర్ ఫొటో, అటెండర్ ఫొటోతో పూర్తి వివరాలు, ఫోన్ నెంబర్లు కనిపిస్తాయి.

తల్లిదండ్రుల బాధ్యత.. బస్సు కండిషన్‌ను పరిశీలించాలి. నిర్దేశించిన ప్రదేశంలో సమయానికి ముందే పిల్లలను తయారుచేసి బస్సు వద్దకు తీసుకురావాలి. రన్నింగ్‌లో ఉన్నప్పుడు ఎక్కించొద్దువిద్యార్థులను బడికి పంపే సమయంలో, తిరిగి వచ్చే సమయంలో తప్పనిసరిగా కుటుంబ సభ్యులు ఉండాలి. పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్నారా గమనించాలి. అవసరమైతే తల్లిదండ్రుల సమావేశంలో ప్రశ్నించాలి.

**పాఠశాల యాజమాన్యాలు పాటించాల్సిన నిబంధనలు**

పసుపు రంగు బస్సులు మాత్రమే ఉపయోగించాలి. దాని పైభాగంలో నాలుగు వైపులా పసుపు రంగు(పార్కింగ్) లైట్లు ఉండాలి. ఆగిన సమయంలో వాటిని వేయడం వల్ల ఇతర వాహనాలకు సూచనగా ఉంటుంది.డ్రైవర్‌కు భారీ వాహనాలు నడిపే లైసెన్సు ఉండాలి. ఐదేళ్ల అనుభవం తప్పనిసరి. 60 ఏళ్లు లోపు మాత్రమే ఉండాలి. డ్రైవర్ లైసెన్సును పాఠశాల యాజమాన్యం విధిగా ఆర్టీఏ కార్యాలయంలో తనిఖీ చేసుకోవాలి. డ్రైవర్‌కు ఖాకీ రంగు యూనిఫాం ఉండేలా చూడాలి. నెలకు ఒకసారి తల్లిదండ్రుల(పేరెంట్స్)తో సమావేశం నిర్వహించాలి. డ్రైవర్, అటెండర్ ఏమైనా పొరపాట్లు చేశారా, బాధ్యతలను మరిచారా.. అనే విషయాలు తల్లిదండ్రుల నుంచి తెలుసుకోవాలి. 15 ఏళ్ల కాలపరిమితి దాటినవి నడపొద్దు. బస్సులు వెళ్లే మార్గాలను సూచించే రూట్ మ్యాప్‌ను విద్యార్థులకు కనిపించే విధంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయాలి.పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించొద్దు. డ్రైవర్‌తో పాటు సహాయకుడు(అటెండర్) తప్పనిసరిగా ఉండాలి.విద్యార్థులు రోడ్డు దాటి వెళ్లాల్సి వచ్చినప్పుడు డ్రైవర్ ముందు నుంచే దాటించాలి. ఇలా చేయడం వల్ల ఇతర వాహనదారుల నుంచి ప్రమాదాలు జరగవు. నెలకు ఒకసారి డ్రైవర్‌కు బీపీ, మధుమేహం, కంటిచూపు పరీక్షలను విధిగా చేయించాలి.ఫిట్‌నెస్ సమయంలో పాఠశాల యాజమాన్యం, డ్రైవర్, అటెండర్ పూర్తి వివరాలను అందించాలి. డ్రైవర్, అటెండర్ పేరు ఫోన్ నెంబర్లు బస్సుపై రాసి ఉంచాలి. రాకపోకల వివరాలు తల్లిదండ్రులకు తెలిపేందుకు అటెండర్ వద్ద ఫోన్ అందుబాటులో ఉంచాలి. సీరియల్ నెంబర్‌తో కూడిన ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉంచాలి.ప్రథమ చికిత్స పెట్టె: డ్రైవర్ సీటుకు వెనుక భాగంలో విధిగా ఉండాలి. ఇందులో 26 రకాల మందుల సామగ్రి (మెడికల్ కిట్) ఉండాలి.ఫైర్ సిలిండర్: కార్బన్‌డైఆక్సైడ్ (సీవో2) ద్రావణం నింపి ఉన్న ఎరుపు రంగుతో కూడిన సిలిండర్ డ్రైవర్‌కు సమీపంలో ఉండాలి.

మ్యాట్: విద్యార్థుల కాళ్లకు దెబ్బలు తగలకుండా కింది భాగంలో మ్యాట్ తప్పనిసరి.

విద్యార్థులకు రక్షణ రాడ్‌లు: విద్యార్థులు బయటకు చేతులు, తలలు పెట్టకుండా బస్సు చుట్టూ ఉన్న కిటికీలకు అడ్డుగా రెండు, మూడు ఇనుప రాడ్‌లు ఉండాలి.

అత్యవసర ద్వారం: డ్రైవర్‌కు కుడిచేతి వైపు బస్సుకు చివర అత్యవసర ద్వారం (ఎమర్జెన్సీ ఎగ్జిట్) ఉండాలి. ఈ ద్వారానికి లోపల బయట ఉన్న వారికి కనిపించే విధంగా ఎరుపు అక్షరాలతో అత్యవసర ద్వారం అని రాసి ఉంచాలి.

ఉమ్మడి జిల్లాలో బడి బస్సుల సంఖ్య- 2175 హనుమకొండ - 1050 వరంగల్ - 451 ములుగు, భూపాలపలి- 242 మహబూబాబాద్- 229 జనగామ - 203

# శిథిలావస్థలో కొన్ని.. అసంపూర్తిగా మరికొన్ని




మహబూబాబాద్ : గ్రామపంచాయతీ కార్యాలయాలకు సొంత గూడు కరవైంది. కొన్ని భవనాలు ఉన్న చోట శిథిలావస్థకు చేరాయి. వాటి స్థానంలో నిర్మాణ పనులు చేపట్టిన కొత్తవి కూడా చాలా వరకు నిధుల కొరతతో అసంపూర్తిగానే మిగిలాయి. కొత్తగా ఏర్పడిన పంచాయతీలు ఇరుకైన అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటి కారణంగా సామగ్రి, ముఖ్యమైన దస్త్రాలను భద్రపరచడానికి అవస్థలు పడుతున్నారు. అసౌకర్యాల మధ్య పంచాయతీ పాలకవర్గం, అధికారులు, సిబ్బంది తమ విధులను నిర్వహిస్తున్నారు. నిర్మాణ బాధ్యతలను చేపట్టిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ అధికారులు, పాలకులు స్పందించి సరిపడా నిధులు కేటాయించి భవనాలను సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. పట్టించుకోకుంటే వర్షాలు కురిస్తే శిథిలావస్థలో భవనాల్లోని విలువైన దస్త్రాలు తడిసిపోతాయని.. అవసరమైనప్పుడు కావాల్సిన సమాచారం లభించక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నర్సింహులపేట మండలంలో నూతనంగా ఏర్పడిన బాసుతండా పంచాయతీ కార్యాలయం ఇది. తండాలోని ప్రాథమిక పాఠశాలలోని ఒక గదిలో కొనసాగిస్తున్నారు. మరొక గదిలో 1 నుంచి 5వ తరగతి వరకు 20 మంది విద్యార్థులకు బోధన కొనసాగుతోంది. పిల్లల చదువులకు ఇబ్బంది కలుగుతోంది. పంచాయతీ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించినప్పుడు పాలకులు, గ్రామస్థులు కూర్చోవడానికి అవస్థలు పడుతున్నారు. నూతన భవనం నిర్మించి..ప్రజలకు, పిల్లలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తండావాసులు కోరుతున్నారు. ఇలాంటి సమస్య జిల్లాలో కొత్తగా ఏర్పడిన 239 పంచాయతీల్లో ఉంది. పలు చోట్ల ఇరుకైన అద్దె భవనాల్లోనే పాలన కొనసాగుతోంది.పది వార్డులతో 1700 మంది జనాభా కలిగిన నెల్లికుదురు మండలం రావిరాల పంచాయతీ పాలన శిథిల భవనంలోనే కొనసాగుతోంది. వర్షం పడితే భవనం కురిసి దస్త్రాలు తడిసిన సందర్భాలున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన అధికారులు నూతన భవన నిర్మాణానికి 2019లో శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం రూ.16 లక్షలు కేటాయించారు. నిధులు సకాలంలో రాక పనులు అసంపూర్తిగా మిగిలాయి. భారీ వర్షాలు కురిస్తే గోడలు నాని కూలిపోయే ప్రమాదం ఉందని, కొత్త భవనం వెంటనే పూర్తి చేయించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహబూబాబాద్ మండలంలో 10 వార్డులు, 1632 మంది జనాభా కలిగిన అమనగల్ గ్రామపంచాయతీ కార్యాలయం నాలుగేళ్ల నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. పాత భవనం శిథిలావస్థకు చేరింది. ఉపాధి హామీ పథకంలో సుమారు రూ.20 లక్షలతో కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు అసంపూర్తిగానే ఉంది. నిధులు సరిపోవడం లేదనే కారణంతోనే గుత్తేదారులు పనులు పూర్తి చేయడం లేదంటున్నారు. అధికారులు, పాలకుల పట్టించుకోకపోవడంతో ఇరుకైన అద్దె భవనంలోనే పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. గ్రామ సభ నిర్వహణకు స్థలం లేకపోవడం సమస్యగా మారింది.

**సమస్యలు ఇవి**

పంచాయతీ కార్యాలయాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదు. గ్రామసభల నిర్వహణకు సరిపడా స్థలాలు లేక ఆరుబయట నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో పాత భవనాలు కురిసి అందులోని విలువైన దస్త్రాలు తడిసిముద్దవుతున్నాయి. ఉన్నతాధికారులతో సమావేశాలు కార్యాలయంలో కాకుండా మరో చోట నిర్వహిస్తున్నారు. కొత్తగా ఏర్పడిన పలు పంచాయతీలు ప్రభుత్వ పాఠశాలల్లోని ఒక గదిలో నిర్వహిస్తున్నారు. దాంతో పిల్లల చదువులకు ఆటంకం కలుగుతోంది. ప్రభుత్వం టీఎస్ ఫైబర్ ద్వారా పంచాయతీలకు కల్పిస్తున్న ఇంటర్‌నెట్ సౌకర్యానికి అంతరాయం కలుగుతోంది. కొంత మంది సర్పంచులు రికార్డులను తమ ఇళ్లలోనే భద్రపరుస్తున్నారు.

జిల్లాలో వివరాలు (ఉపాధిహామీ నిధులతో) అనుమతి ఇచ్చినవి 151 కేటాయించిన నిధులు (రూ. కోట్లలో) 27 పూర్తైన పనులు 48 పురోగతిలో ఉన్నవి 18 ప్రారంభించనవి 85

# అందుబాటులోకి వసతులు

కరీంనగర్ : నగరాలు, పట్టణాల్లో గతంలో కంటే మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుండడంతో ఆ దిశగా పనులు పూర్తి చేస్తున్నారు. నగరంతోపాటు పట్టణాల్లో మార్పులు వచ్చాయి. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా ప్రత్యేక కథనం..కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు కొత్తపల్లి, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి నిధులు ప్రతినెలా కేటాయించడంతో ప్రజలకు కావాల్సిన సౌకర్యాలపై దృష్టి సారించారు. 14, 15 ఆర్థిక సంఘం నిధులు కూడా మంజూరవుతున్నాయి. ఈ నిధులతో ప్రజావసరాలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి పనులు, పర్యావరణం, పచ్చదనం, పారిశుద్ధ్యం, సుందరీకరణ వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యమిచ్చి ఆ పనులన్నీ పూర్తి చేయించారు.

**పారిశుద్ధ్య వాహనాలతో ర్యాలీ..**

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేలా పట్టణ ప్రగతి దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. నగర పాలిక పరిధిలో ఉదయం 9 గంటలకు కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. దశాబ్ది ఉత్సవాల లోగోతో మానవహారం నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి పద్మనాయక కల్యాణ మండపం వరకు అలంకరించిన పారిశుద్ధ్య వాహనాలతో ర్యాలీ నిర్వహిస్తారు. ప్రతిభ కనబర్చిన అధికారులకు, ఉద్యోగులకు సన్మానాలు, పురస్కారాలు అందించేలా కార్యాచరణ



చేశారు. నగరంలో చేపట్టిన పనుల నివేదికను ప్రదర్శిస్తారు. ఈ సమావేశానికి మంత్రి గంగుల కమలాకర్‌తోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు.

నగరపాలక సంస్థ పరిధిలో 60 డివిజన్లు ఉండగా ఆయా ప్రాంతాల్లో రహదారులు, మురుగునీటి కాల్వలు, తాగునీటి వసతి, వీధిదీపాలు, పార్కులు, ఓపెన్‌జిమ్‌లు, వెండింగ్‌జోన్లు, వాకింగ్‌ట్రాక్‌లు వంటివి నిర్మించడంతో ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. స్మార్ట్‌సిటీ, అమృత్ నిధులు, ముఖ్యమంత్రి హామీ నిధులు రావడంతో నగర రూపురేఖలు పూర్తిగా మారాయి. ప్రత్యేకంగా పట్టణ ప్రగతి నిధులు కూడా తోడుగా మారడంతో అభివృద్ధిలో మార్పు కనిపిస్తోంది. గత నాలుగేళ్లుగా రూ.వందల కోట్లు కేటాయించగా అత్యధిక పనులు పూర్తి కాగా మిగతావి పురోగతిలో ఉన్నాయి.

**కల్పించిన సౌకర్యాలు ఇలా..**

కరీంనగర్ నగర పాలికలో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో భాగంగా స్వచ్ఛ ఆటోలు కొనుగోలు చేశారు. ఫాగింగ్ మిషన్లు, చైన్ పొక్లెయిన్, జెట్టింగ్ మిషన్, డీసిల్టింగ్ మిషన్, కంపాక్టర్, ట్రాక్టర్లు, ట్యాంకర్లు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. ప్రజా మరుగుదొడ్లు(సులభ్ కాంప్లెక్స్) షీ టాయిలెట్ బస్, సఫాయిమిత్ర, హరితహారంలో భారీగా మొక్కలు నాటి పెంచడం, నర్సరీలు, కూడళ్లలో పచ్చదనం, పట్టణ ప్రకృతి వనాలు, సమీకృత మార్కెట్ల నిర్మాణాలు, వైకుంఠధామాల అభివృద్ధి వంటి సౌకర్యాలు కల్పించారు.

## కోరుట్ల బల్దియాకు రాష్ట్ర స్థాయి అవార్డులు

కోరుట్ల : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పట్టణ ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పురపాలక సంఘాలకు అవార్డులను ప్రకటించింది. ఇందులో కోరుట్ల పురపాలికకు రెండు రాష్ట్రస్థాయి అవార్డులు దక్కాయి. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా అమలు చేయడం, ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, హరితహారంలో భాగంగా సెంట్రల్ మీడియన్ ప్లాంటేషన్ కింద అవార్డులు కేటాయించారు. శుక్రవారం హైదరాబాద్ లో జరగనున్న అవార్డుల ప్రదానోత్సవం సందర్భంగా పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పుర ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ అయాజ్ అవార్డులను అందుకోనున్నారు.

**వెల్లివిరిసిన పచ్చదనం**

కోరుట్ల పట్టణంలో హరితహారంలో విస్తృతంగా మొక్కలు నాటడంతో పచ్చదనం సంతరించుకుంది. పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో సుమారు 4.5 కి.మీ పొడవునా అధునాతన డివైడర్లను నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. డివైడర్ల మధ్యలో మొక్కలు నాటి నిత్యం వాటికి నీటిని పట్టడంతో పచ్చదనంతో నిండిపోయింది. మొక్కలు భారీగా పెరగకుండా తరచూ కత్తిరింపు చర్యలు చేపట్టడంతో ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. సెంట్రల్ లైటింగ్, విద్యుత్తు స్తంభాలకు రంగు రంగుల ఎల్‌ఈడీ బల్బులను అమర్చడంతో రాత్రిపూట రహదారి అందంగా కనిపిస్తుంది. పురపాలికలోని 33 ప్రాంతాల్లో పట్టణ వనాలను ఏర్పాటు చేసి సుమారు 25 వేల మొక్కలను నాటించారు. వాటికి నిత్యం నీటిని పట్టడంతో అవి ఏపుగా పెరిగి చెట్లుగా వృద్ధి చెందాయి. ప్రభుత్వం హరితహారంలో కోరుట్ల పురపాలికకు అవార్డు ప్రకటించడంతో పాలకవర్గం హర్షం ప్రకటించింది.

**అందుబాటులోకి ప్రజా మరుగుదొడ్లు**

కోరుట్ల పట్టణంలో శతశాతం మరుగుదొడ్ల నిర్మాణం, ఆరుబయట మల విసర్జన నిషేధాన్ని అమలు చేస్తున్నారు. దీంతో మున్సిపల్‌కు ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ గుర్తింపు వచ్చింది. పుర ప్రజలకు, వివిధ పనుల మీద పట్టణానికి వచ్చే ప్రజల కోసం రెండేళ్లుగా ప్రజామరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. కొత్తబస్టాండ్, నందిచౌక్, కల్లూర్‌రోడ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, అయ్యప్పగుట్ట, సాయిబాబా దేవాలయం, ఏఖీన్‌పూర్ బస్టాండ్‌లో ప్రజా మరుగుదొడ్లు నిర్మించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యనభ్యసించేందుకు వచ్చే వందల మంది విద్యార్థులకు ఉచితంగా, మిగతా ప్రజలను నామమాత్రపు రుసుం చెల్లించి వినియోగించుకుంటున్నారు. వీటి నిర్వహణ సక్రమంగా చేపట్టడంతో ప్రభుత్వం గుర్తించి రాష్ట్రస్థాయి అవార్డును కేటాయించింది.

# ఇల్లెందు.. పచ్చదనం కనువిందు

ఇల్లెందు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాల్లో ఇల్లెందు పురపాలిక మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. తాజాగా హరితహారంలో రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలవటం విశేషం. రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం తాజాగా 'హరితహారం-పచ్చదనం' విభాగంలో అవార్డులు ప్రకటించింది. 25-50 వేల మధ్య జనాభా కేటగిరీలో ఇల్లెందు ఉత్తమ పురపాలికగా ఎంపికైంది. హైదరాబాద్ శిల్ప కళావేదికలో అవార్డును మంత్రి కేటీఆర్ శుక్రవారం అందజేస్తారు. గతేడాది ప్రజా మరుగుదొడ్ల విభాగంలో ఉత్తమ పురపాలికగా ఎంపికైంది.

పచ్చదనానికి ప్రాధాన్యం: '2022-23 హరితహారం'లో భాగంగా 1.30 లక్షల మొక్కలు నాటాలనే ఇల్లెందు పురపాలికకు సీడీఎంఏ అధికారులు లక్ష్యం విధించారు. పట్టణంలోని 24 వార్డుల్లో రహదారులకు రెండువైపులా, ప్రధాన రహదారి డివైడర్‌పై, 20



ప్రకృతివనాల్లో సిబ్బంది మొక్కలు నాటారు. ఇంటింటికీ ఆరు చొప్పున పంపిణీ చేశారు. నాటినవన్నీ ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టారు. పట్టణంలో పచ్చదనం మెరుగుపడింది. గతంలోనూ స్వయం సహాయ సంఘాల అభివృద్ధి, వీధి వ్యాపారుల రుణాల మంజూరులో రాష్ట్రస్థాయిలో ఇల్లెందు రెండో స్థానాన్ని దక్కించుకుంది. 2014లో ఎస్‌హెచ్‌జీల సంఖ్య 415 కాగా ప్రస్తుతం 745కి విస్తరించాయి. సభ్యుల సంఖ్య 7,500 మందికి చేరింది.'ఎమ్మెల్యే హరిప్రియ, కౌన్సిలర్లు, అధికార యంత్రాంగం, ప్రజల సహకారం వల్లే ఈఅవార్డు లభించింది. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతాం వెంకటేశ్వరరావు, పుర ఛైర్మన్

# లక్ష్యం 149.. పూర్తి 16

వరంగల్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనేది లక్ష్యం.. అనుకున్న స్థాయిలో పురోగతి లేకపోవడంతో నిరాశే ఎదురవుతోంది. నూతన విద్యా సంవత్సరంలో కొత్త హంగులతో పాఠశాలలు ముస్తాబవుతాయని భావించినా.. ఆశలు అడియాసలయ్యాయి. దీంతో సమస్యల మధ్యనే చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఈ పథకం కింద మొదటి విడతగా 149 పాఠశాలలు ఎంపిక చేశారు. అవసరం ఉన్నచోట భవనాలు, అదనపు గదులు, డైనింగ్ హాళ్లు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణాలు, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి వసతి, రంగులు వేయడం, గ్రీన్ బోర్డులు, ఇతర పనులు, మరమ్మతులు చేపట్టాలి. పనులు వేసవి సెలవుల్లోగా పూర్తి చేయాలని గడువు పెట్టుకున్నారు. కానీ, కేవలం 16 మాత్రమే పూర్తయ్యాయి.. మిగతావి వివిధ స్థాయిల్లో కొనసాగుతూనే ఉన్నాయి. ముందస్తుగా మండలానికి రెండు పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పనులు చేపట్టారు. రేగొండ మండలం లింగాలలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పూర్తిచేసి ఫిబ్రవరి 1న ప్రారంభించారు. ఆయా పాఠశాలల్లోని కొన్ని పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. సివిల్ పనుల కింద రూ.22.86 కోట్లు, ఉపాధి హామీ పథకం కింద రూ.18.95 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.10 కోట్లు ఖర్చు చేశారు. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు రావడం లేదని, పనులు అందుకే పూర్తికావడం లేదని చెబుతున్నారు.

కాటారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరడంతో 'మన ఊరు-మన బడి' కింద రూ.24 లక్షలు మంజూరు చేశారు. ఉన్న పాఠశాలను కూలగొట్టి నూతనంగా రెండు తరగతి గదుల నిర్మాణం మొదలు పెట్టారు. కానీ, ఇప్పటికీ పనులు పిల్లర్ల



దశను దాటలేదు. గత విద్యా సంవత్సరంలో అద్దె భవనంలోనే తరగతులు కొనసాగించారు. పనులు పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో ఈ ఏడాది కూడా అసౌకర్యాల మధ్య చదువు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

అవస్థల నడుమ చదువులా..?

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దాలని, దశల వారీగా పనులు చేపట్టాలని నిర్ణయించినా మొదటి దశ పనులు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దాదాపు ఏడాది క్రితమే పనులు చేపట్టినా ఇప్పటికీ పూర్తికాకపోవడం శోచనీయం. వేసవి సెలవులు సద్వినియోగం చేసుకుని పనులు చేపడతారని భావించినా పూర్తి చేయలేకపోయారు. మళ్లీ అవస్థల నడుమ చదువులు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. పలిమెల మండలం బోడాయిగూడెం ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి తీసుకొచ్చిన ఇటుకలివీ.. పనులు పునాది దశలోనే ఉన్నాయి. భవన నిర్మాణం పెండింగ్‌లో ఉంది. ఇది చిట్యాల మండలం చల్లగరిగె ప్రాథమిక పాఠశాల.. మన ఊరు-మన బడి కార్యక్రమంలో రూ.26 లక్షలతో రెండు అదనపు గదులను నిర్మిస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైనా పనులు పూర్తికాలేదు.

పనులు పూర్తి చేయిస్తాం

మన ఊరు-మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో పనులు పూర్తి చేయిస్తాం. 20వ తేదీన పూర్తయిన 16 పాఠశాలలను ప్రారంభిస్తాం. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనులను త్వరలోనే పూర్తయ్యేలా చూస్తాం.రాంకుమార్, డీఈవో

# పక్కాగా.. క్లస్టర్ల వారీగా...



ఖమ్మం : ప్రకృతి విపత్తుల నుంచి పంటలను రక్షించుకోవాలంటే వానాకాలం, యాసంగి సాగును నెలరోజుల ముందు చేపట్టాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఓవైపు రైతుల్ని ముందస్తు సాగుకు సమాయత్తపరుస్తూనే.. మరోవైపు క్షేత్రస్థాయిలో భూముల స్థితిగతులపై సమగ్ర అధ్యయనం కోసం ప్రత్యేక సర్వేకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగుభూముల స్థితిగతుల గురించి ఆరా తీశారు. సాగునీటి వనరులు- ఆయకట్టు విస్తీర్ణం, వర్షాధారంగా సాగయ్యే భూముల విస్తీర్ణం తదితర వివరాలను ఈనెల 7 నుంచి 12 వరకు వ్యవసాయ విస్తరణ అధికారులు సేకరించారు.పొంతన కుదరటం లేదని.. రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి వనరుల విషయంలో వ్యవసాయ, విద్యుత్తు, జలవనరుల శాఖల మధ్య పొంతన కుదరటం లేదని ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశంతో వాస్తవం, కచ్చితత్వంతో కూడిన సమగ్ర సర్వేకు వ్యవసాయశాఖ కమిషనర్ పూనుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో క్లస్టర్ల వారీగా సాగునీటి వివరాల లెక్క తేల్చారు. అన్ని జిల్లాల నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా సర్వే వివరాలను ప్రభుత్వం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

కచ్చితత్వంతో కూడిన జాబితా..!2022 వానాకాలంలో పంటల సాగు విస్తీర్ణాన్ని ప్రాతిపదికగా తీసుకున్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా నికర సాగు భూమి ఎంతో వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ) లాగిన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది. ఇందుకోసం గ్రామాల్లో పంటల భూముల వివరాలు తెలిసిన వ్యక్తులు, రైతుబంధు సమితి సభ్యులు, సర్పంచులను ఏఈఓలు సంప్రదించి తాము మదింపు చేసుకున్న వివరాలను సరిపోల్చుకున్నారు. మండల స్థాయిలో వ్యవసాయ, జలవనరులు, విద్యుత్తుశాఖ, గణాంక అధికారుల వద్దనున్న వివరాలను సరిచూసుకున్నారు. గ్రామాలు, మండలాలు, డివిజన్ల వారీగా కచ్చితత్వంతో కూడిన జాబితా రూపొందించారు.

# బడి పిల్లలకు పస్తులేనా..?



కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించలేమని ఏజెన్సీ నిర్వాహకులు చేతులెత్తేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజనంలో మార్పులు చేసుకుంటా గురుకులాలకు దీటుగా మెనూ అందించాలని సంకల్పించాయి. అయితే మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు బకాయిలు చెల్లించటం లేదు. పైగా ఈఏడాది నుంచి కేవలం గౌరవ వేతనంతో పనిచేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పెంచిన వేతనం అమలుకావటం లేదని, సరకులను సరఫరా చేస్తే అధికారులు వండిపెట్టాలని చెబుతున్నారని కార్మికులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. చాలాచోట్ల వంటలు వండటం లేదు. ఫలితంగా విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి మధ్యాహ్న భోజన నిర్వహణకు కష్టాలు మొదలయ్యాయి. విద్యార్థులు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొంది.

ఇప్పటికే అప్పులు తీసుకొచ్చి భోజనం పెట్టాం. మళ్లీ అప్పు చేసి వంట ఎలా చేస్తాం. కూరగాయలు, కోడిగుడ్లను టెండర్ ద్వారా గుత్తేదారులకు అప్పగిస్తున్నారు. అప్పటివరకు మళ్లీ పాత పద్ధతిలో భోజనం అందించాలని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికైనా మా సమస్యలు పరిష్కరించాలి. అప్పటివరకు వంటలు చేయబోం.

విజయలక్ష్మి, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, భద్రాద్రి

వంట ఏజెన్సీ కార్మికులకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డించేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించాం. వంట ఏజెన్సీ కార్మికులతోనూ మాట్లాడుతున్నాం. బకాయిలు అందేలా చర్యలు తీసుకుంటాం.

సోమశేఖర్‌శర్మ, డీఈఓ

భద్రాద్రి జిల్లా పాతకొత్తగూడెంలోని ఆనందఖని ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో మూడు రోజుల నుంచి మధ్యాహ్న భోజనాన్ని వండటం లేదు. పాత బకాయిలు మంజూరు చేసి గౌరవ వేతనం పెంచితేనే వంటలు వండుతామని ఏజెన్సీ కార్మికులు చెబుతున్నారు. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బూడిదగడ్డ ఉన్నత పాఠశాలలోనూ ఇదే పరిస్థితి.

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన బిల్లులు బకాయిలు ఉండటంతో ఏజెన్సీ నిర్వాహకులు ముగ్గురు విధులకు రావటం లేదు. పాఠశాల యాజమాన్యం కొత్తగా కార్మికులను నియమించుకుంది. మరికొన్నిచోట్ల ఇలాంటి పరిస్థితులున్నాయి.

ఇదీ పరిస్థితి..

గతేడాది భద్రాద్రి జిల్లాలో 9, 10వ తరగతి విద్యార్థులకు ఆరు నెలల పాటు అందజేసిన కోడిగుడ్లకు రూ.99,62,234, కూరగాయలకు రూ.30,66,782 చెల్లించాల్సి ఉంది. ఈ బిల్లులు మంజూరైనా కొన్నిరోజుల పాటు 'ఈ-కుబేర్ సాఫ్ట్‌వేర్'లో నిల్వ రూపంలో చూపించారు. అయితే 23 మండలాల్లోని 2,225 నిర్వాహకుల ఖాతాల్లోనూ జమకాలేదు. మంజూరైన బకాయిలు వెనక్కి వెళ్లిపోయాయి. ఖమ్మం జిల్లాలో ఒకటోతరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు కోడిగుడ్డు బకాయిలు రూ.1,57,98,200, 9,10వ తరగతి బకాయిలు రూ.1,34,86,400 పేరుకుపోయాయి. వంట ఏజెన్సీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనం రూ.1,000 నుంచి రూ.3వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినా ఆచరణకు నోచుకోవడం లేదు. ఇన్ని సమస్యల నడుమ వంటలు చేయలేమంటూ నిర్వాహకులు తేల్చిచెబుతున్నారు.

# అతివలకు ఆర్థిక భరోసా..



మణుగూరు : జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకు లింకేజీ రుణాల లక్ష్యం ఖరారైంది. 22 మండలాల్లోని 10,527 ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకు లింకేజీ రుణాలు రూ.380.96 కోట్లు పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. అధికంగా బూర్గంపాడు మండలంలో 820 ఎస్‌హెచ్‌జీలు ఉండగా రూ.30.05 కోట్లు, అత్యల్పంగా ఆళ్లపల్లి మండలంలోని 196 ఎస్‌హెచ్‌జీలకు రూ.6 కోట్లు రుణాలుగా పంపిణీ చేయనున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రుణ లక్ష్యం గణనీయంగా తగ్గింది. గతేడాది 14,819 ఎస్‌హెచ్‌జీలకు రూ.620.93 కోట్ల రుణం పంపిణీ చేయాలని నిర్ణయించినా లక్ష్యాన్ని అందుకోలేకపోయారు. 8,133 ఎస్‌హెచ్‌జీలకు రూ.451.88 కోట్లు మాత్రమే అందజేశారు. ఈసారి అవసరం ఉన్న ఎస్‌హెచ్‌జీలకు మాత్రమే రుణాలు ఇవ్వాలని సంకల్పించారు.

గతేడాదిగా బ్యాంకు లింకేజీ రుణాలతో ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఎంటర్‌ప్రైజెస్ పేరిట వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు. ఈసారీ వాటికే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. క్రమం తప్పకుండా బ్యాంకులకు కిస్తీలు చెల్లించేలా చైతన్యం తీసుకొస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో వివిధ బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు పొందుతూ చాలా ఎస్‌హెచ్‌జీలు వ్యాపారాల్లో రాణిస్తున్నాయి. కుట్లు, అల్లికలు, పచ్చళ్లు, విస్తరాకులు, కాగితం గ్లాసులు, పళ్లాల తయారీతో ఆర్థికంగా బలోపేతమవుతున్నాయి. పలువురు ఇళ్ల వద్ద స్టేషనరీ, ఫ్యాన్సీ, పండ్లు, కూరగాయల దుకాణాలను ఏర్పాటుచేసుకున్నారు. అశ్వాపురంలో ఓ ఎస్‌హెచ్‌జీ ఆధ్వర్యంలో కార్ల సర్వీసింగ్ సెంటర్ కొనసాగుతోంది. దుమ్ముగూడెం మండలం నర్సాపురంలో ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ రుణం రూ.3లక్షలతో ఎంటర్ ప్రైజెస్ యూనిట్ కింద కిరాణ దుకాణం ఏర్పాటు చేశారు. మే 4న ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి నిర్వాహకులను అభినందించారు.

అశ్వాపురం మండలం మొండికుంటలో ఎస్‌హెచ్‌జీ బ్యాంకు లింకేజీ రుణం రూ.4 లక్షలతో పీఎంఎఫ్‌ఎంఈ కింద ఏర్పాటు చేసిన ఆహార ప్రాసెసింగ్ యూనిట్ ఇది.కారం, పిండి, పప్పు, ఆయిల్ మిల్లులు, గ్రైండర్ తదితరాలు ఉన్నాయి. ఇక్కడ ఒక రూపంలోని ఆహారాన్ని మరో రూపంలోకి ప్రాసెసింగ్ చేస్తారు. అంటే మిరపకాయలను కారంగా మారుస్తారన్నమాట. తర్వాత ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తుంటారు. ఈ యూనిట్ కేంద్ర ప్రభుత్వానికి చెందినది కావడంతో దీని కింద తీసుకున్న రుణానికి 35 శాతం రాయితీ వర్తిస్తుందని నిర్వాహకురాలు తులసి సృజన తెలిపారు. ఈసారి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయడానికి దృష్టిపెట్టనున్నాం. ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రుణాల సద్వినియోగంపై అవగాహన కల్పిస్తాం. రుణాల ద్వారా వ్యాపారాలు, ఎంటర్ ప్రైజెస్‌లు నిర్వహించుకుంటూ స్వయం సమృద్ధి సాధించే దిశలో ఎస్‌హెచ్‌జీలను ప్రోత్సహిస్తాం.బి.మధుసూదనరాజు, డీఆర్‌డీవో

# మురుగు నీటి శుద్ధీకరణకు తొలి అడుగు

వరంగల్ : మురుగు నీటి శుద్ధీకరణకు తొలి అడుగు పడనుంది. వరంగల్ నగరంలో ప్రప్రథమంగా ఉర్సు రంగసముద్రం (ఉర్సు చెరువు) వద్ద నిర్మించిన శుద్ధీకరణ కేంద్రం అందుబాటులోకి రానుంది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా దీన్ని ప్రారంభించనున్నారు. పాతబసీత ప్రాంతంలో ఉర్సు చెరువు పెద్దది. రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాల్లోని మురుగు, వరద నీరు దీనిలోకి చేరుతుంది. చెరువును సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రణాళిక రచించారు. చెరువులోకి నేరుగా మురుగు చేరకుండా చర్యలు చేపట్టారు. రోజుకు ఐదు మిలియన్ లీటర్ల సామర్థ్యంతో మురుగు నీటి శుద్ధీకరణ కేంద్రాన్ని చేపటారు. స్మార్ట్‌సిటీ పథకం ద్వారా సుమారు రూ.16 కోట్లు దీనికి కేటాయించారు. ఉర్సు చెరువు దిగువున సీవేజ్ ట్రీట్‌మెంటు ప్లాంటు నిర్మించారు.

రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్ ప్రాంతాల నుంచి వచ్చే మురుగును మళ్లించేందుకు కాల్వలు నిర్మించారు. ఇక్కడ మురుగు నీటిని శుద్ధి చేసి, ఉర్సు రంగసముద్రంలోకి వదులుతారు. రెండేళ్ల



కిందట ఎంజీఎం ఆసుపత్రిలో రెండు ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ప్లాంటు కేవలం ఆసుపత్రికే పరిమితం చేశారు. నగరంలో తొలి మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం ఉర్సుగుట్ట వద్ద అందుబాటులోకి రానుంది.

చెరువు సుందరీకరణకు ప్రణాళిక..: ఉర్సు చెరువు, రంగలీల మైదానాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించారు. స్మార్ట్‌సిటీ పథకం ద్వారా రూ.14 కోట్లతో ఉర్సు ట్యాంకు బండ్ పనులకు ఈ నెల 17న కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నారు. ఉర్సుగుట్ట-రంగశాయిపేట నాయుడు పంపు 100 అడుగుల రహదారిలో ట్యాంకు బండ్, లైటింగ్, గ్రీనరీ పనులు చేపడతారు. చెరువులో బోటింగ్ ఏర్పాటు చేస్తారు. ఉర్సు రంగలీల మైదానంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర అవసరాల కోసం కొత్తగా సాంస్కృతిక సమావేశ కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

# పట్టణ ప్రగతి.. చకచకా అభివృద్ధి

వరంగల్ : ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం మూడేళ్ల కిందట పట్టణ ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల నెలా జనాభా ప్రాతిపదికన పుర, నగర పాలికలకు 15వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ప్రభుత్వ నిధులు కేటాయిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రేటర్ వరంగల్‌కు మూడేళ్లలో మొత్తం రూ.196.48 కోట్లు విడుదల చేయగా.. అందులో రూ.157.69 కోట్ల నిధులు ఖర్చు చేశారు. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర పురపాలక శాఖ ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని నిర్వహించనుంది ఈ నేపథ్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలో జరిగిన అభివృద్ధిపై ప్రత్యేక కథనం..

ముఖ్యమైన పనుల వివరాలు.. నగర జనాభా సుమారు 8.77 లక్షలు, 877 సీటర్స్ ప్రజా మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యం ఉండగా.. పట్టణ ప్రగతి ద్వారా సుమారు రూ.25 కోట్లతో వెయ్యి సీటర్స్ మరుగుదొడ్లు నిర్మించారు. ప్రత్యేకంగా మహిళలు, మొబైల్ మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చాయి. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో కొత్తగా 26 పట్టణ ప్రకృతి వనాలు అభివృద్ధి పరిచారు. హనుమకొండ వాజ్‌పాయ్‌నగర్‌లో సుమారు రూ.4.50 కోట్లతో ఆధునిక వైకుంఠ ధామం ప్రారంభించారు. వరంగల్‌లో పోతన నగర్, తిలక్‌రోడ్‌లో మరో రెండు ప్రతిపాదించారు. వరంగల్ లక్ష్మీపురం, హనుమకొండ నక్కలగుట్ట ఐబీ కార్యాలయం వద్ద సమీకృత శాకాహార, మాంసాహార మార్కెట్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇంటింటా చెత్త



సేకరణకు కొత్తగా 420 వాహనాలు కొనుగోలు చేశారు,ప్రధాన రహదారులు శుభ్రం చేసేందుకు 10 స్వీపింగ్ యంత్రాలు తీసుకున్నారు. దోమల నివారణ కోసం నాలుగు పెద్దవి, 50 చేతి ఫాగింగ్ మిషన్లు ఏర్పాటు చేశారు. చెరువులు, కుంటల్లో వ్యర్థాలు తొలగించేందుకు రూ.2 కోట్లతో ఫ్లోటింగ్ ట్రాష్ కలెక్టర్ మిషన్‌ను కొనుగోలు చేశారు.ఉచిత అంత్యక్రియల కోసం రెండు స్వర్గ రథాలు కొన్నారు. సెప్టిక్ ట్యాంకుల శుభ్రత కోసం 12 వాహనాలు ఏర్పాటు చేశారు. 4300 విద్యుత్తు స్తంభాలు, 20 ప్రాంతాల్లో క్రీడా మైదానాలు, 22 నర్సరీలు ఏర్పాటు చేశారు.

పురోగతి ఇలా పాలనా పరమైన మంజూరు నిధులు రూ.198.56 కోట్లు రూ.124.76 కోట్లతో 369 పనులు పూర్తి రూ.41.91 కోట్లతో 41 పనులు పురోగతిలో ఉన్నాయిరూ.31.88 కోట్లతో 114 పనులు మొదలు పెట్టాల్సి ఉంది.

# ఆగని అక్రమ దందా




ఆదిలాబాద్ : జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. అక్రమార్కులు య థేచ్ఛగా మహారాష్ట్ర కు తరలిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నా రు. కొందరు వ్యాపారులు ఇదేపనిగా గ్రామాల్లో తమ ప్రతినిధుల ద్వారా రేషన్ బియ్యాన్ని సేకరించి పెద్దమొత్తంలో సరిహద్దులు దాటిస్తున్నారు. గడిచిన ఏడు నెలల్లో జిల్లావ్యాప్తంగా 600క్వింటాళ్లకుపైగా పోలీసుల తనిఖీల్లో రేషన్ బియ్యం పట్టుబడడం చూస్తుంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తూనే ఉంది. కొందరు లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని తినేందుకు ఇష్టపడడం లేదని తెలుస్తుంది. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రాయితీ బియ్యాన్ని తీసుకోవడం, దళారులకు అమ్మేసుకోవడం పరిపాటిగా మారింది. జిల్లాలో సేకరించిన రేషన్ బియ్యాన్ని సరిహద్దు మండలాలైనా తలమడుగు, బోథ్, తాంసి, బేల, జైనథ్, నార్నూర్ మండ లాల మీదుగా మహారాష్ట్రకు తరలిస్తున్నారు. మహారాష్ట్రలోని బోరి, కిన్వ ట్, నాగ్‌పూర్, పాంఢ్రకవడ, ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అమ్మేసుకుంటున్నారు. దొరికితే దొంగ.. లేక పోతే దొర అన్న చందంగా జిల్లాలో రేషన్ బియ్యం అక్రమదందా కొనసాగుతోంది. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ కాలానికి చెందిన రెహమాన్ అనే నిందితుడు మహారాష్ట్రకు రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని అరెస్టు చేశారు. అలాగే జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్రలోని బోరి గ్రామానికి మూడు ఆటోల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తుం డగా పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఇలా జిల్లాలో ఏదో ఒకచోట రేషన్ బియ్యం నిల్వలు పట్టుబడుతున్నా.. సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పత్తా లేకుండానే పోతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు పోలీసుల తనిఖీల్లోనే గుట్టలకొద్ది రేషన్ బియ్యం పట్టుబడుతున్నా.. సంబంధిత శాఖ అధికారులకు ఏమాత్రం పట్టింపే లేకపోవడం గమనార్హం. నేరుగా లబ్ధిదారులకు నగదు?రేషన్‌బియ్యం అక్రమదందాకు అడ్డుకట్ట పడకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ స్కీమ్) విధానాన్ని అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. డీబీటీ పథకం అమలుతో రేషన్ బియ్యం అక్రమదందాకు అడ్డుకట్ట వేయాలని భావిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ విధానం ద్వారా రేషన్ బియ్యాన్ని తినేందుకు ఇష్టపడని లబ్ధిదారులను గుర్తించి నేరుగా వారి అకౌంట్లలో నగదును జమ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ విధానం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతోందని అధికారులు పేర్కొంటున్నా రు. డీబీటీ విధానంతో అక్రమ బియ్యం సరఫరా అరికట్టవచ్చనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. కొందరు లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని కిరాణాషాపుల్లో విక్రయిస్తూ నిత్యావసర వస్తువులను తీసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. కిరాణా దుకాణందారులు టోకుగా దళారులకు అమ్మేసుకోవడంతో అక్రమదందా యథేచ్ఛగా సాగుతోంది. మహారాష్ట్రలో డిమాండ్‌జిల్లాలో దళారులు సేకరిస్తున్న రేషన్‌బియ్యానికి మహారాష్ట్రలో భారీ గా డిమాండ్ ఉన్నట్లు తెలుస్తుంది. పరిస్థితిని బట్టి ఇక్కడ కిలో బియ్యం రూ.10 నుంచి రూ.12 పెట్టి సేకరిస్తున్న వ్యాపారులు.. పెద్ద మొత్తంలో మహారాష్ట్రకు తరలిస్తూ కిలో రూ.14 నుంచి రూ.16 వరకు అమ్మేసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఇలా కిలో బియ్యం వెంట రూ.2-రూ.3 వరకు లాభం వస్తున్నట్లు తెలుస్తుంది. అంటే క్వింటాలు బియ్యానికి రూ.200 నుంచి రూ.400 వరకు సంపాదిస్తున్నారు. కొందరు దీనినే పనిగా పెట్టుకోవడంతో పోలీసుల తనిఖీల్లో పదేపదే పట్టుబడుతున్నారు. మహారాష్ట్ర దళారులతో కుమ్మక్కై దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. రేషన్ బి య్యంతో పాటు అడ్డదారుల్లో పత్తి, పప్పు దినుసులు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, అలాగే గంజాయి, తదితర వస్తువుల రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. మహారాష్ట్ర నుంచి దేశీదారు మద్యం, గుట్కాను దిగుమతి చేసుకుంటూ జిల్లా నుంచి రేషన్ బియ్యం, గంజాయిని సరఫరా చేస్తూ.. పోలీసుల తనిఖీల్లో పట్టుబడుతున్నారు. అక్రమదందాలను అడ్డుపెట్టుకుని కొందరు అధికారులు మాముళ్ల వసూళ్లకు ఎగబడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారులకు అన్ని తెలిసినా.. చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. నామమాత్రంగానే తనిఖీలుజిల్లా సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నామమాత్రంగానే తనిఖీలు కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. అక్రమదందాలకు అడ్డుకట్ట వేసేందుకే జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినా.. ఫలితం కనిపించడం లేదు. ఇక్కడి సిబ్బంది చేతివాటానికి పాల్పడడంతో అక్రమదందాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఏళ్ల తరబడి చెక్‌పోస్టు సిబ్బంది ఒకే చోట విధులు నిర్వహించడంతో స్మగ్లర్లతో సత్సంబంధాలు ఏర్పడుతున్నా యి. బేల మండలంలో సాంగిడి, కంగార్‌పూర్, మార్గుడ్, కొబ్బాయి గ్రా మాల నుంచి మహారాష్ట్రకు రాకపోకలు కొనసాగుతున్నాయి. కానీ ఈ మండల పరిధిలో ఎక్కడా తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అక్రమదందా యథేచ్ఛగా సాగుతోంది. అలాగే తాంసి మండలంలో కరంజి(టి) గ్రామం నుంచి మహారాష్ట్రకు రాకపోకలు సాగుతున్నా.. ఇక్కడ కూడా చెక్ పోస్టును ఏర్పాటు చేయలేదు. బోథ్ మండలంలో ఘన్ పూర్ గ్రామం వద్ద ఎక్సైజ్, వ్యవసాయ, మార్కెటింగ్, వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసినా.. నామమాత్రం గానే తనిఖీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. చెక్‌పోస్టులకు చెల్లించే మామూళ్ల భారం పెరిగిపోవడంతో కొందరు వ్యాపారులు తెలివిగా అడ్డదారుల్లో దందాను కొనసాగిస్తున్నారు. రాత్రికి రాత్రే కాలినడకన సరిహద్దు లు దాటిస్తూ అమ్మేసుకుంటున్నారు. తలమడుగు మండలంలో లక్ష్మీపూర్ గ్రామం వద్ద తనిఖీ కేంద్రం ఉన్నా.. ఇక్కడంతా ప్రైవేటు సిబ్బందే పెత్త నం. జిల్లాలో సరిపడా ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అధికారులున్నా.. తనిఖీలకు మాత్రం వెనుకడుగు వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.అన్ని రకాల కట్టడి చర్యలు తీసుకుంటున్నాం: సుదర్శన్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, ఆదిలాబాద్‌జిల్లాలో జరుగుతున్న అక్రమ రేషన్ బియ్యం దం దాను అరికట్టేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తని ఖీల్లో పట్టుబడిన రేషన్ బియ్యాన్ని తిరిగి లబ్ధిదారులకే సరఫరా చేస్తు న్నాం. మహారాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘాను సారిస్తున్నాం. రేషన్ బియ్యం సరఫరాలో కొన్ని మార్పులు చేర్పులు చేపట్టే అవకాశం ఉంది. లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే రేషన్‌కార్డును రద్దు చేసే అవకాశం ఉంది.20 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యం స్వాధీనంఆదిలాబాద్ టౌన్: ఆదిలాబాద్ గ్రామీణ పోలీసు స్టేషన్ పరిధిలోని రాంపూర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు బోలెరో మ్యాక్స్ వాహనంలో ప్రబుత్వ రాయితీ బియ్యాన్ని తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేర కు తనిఖీ చేయగా.. 20 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యం లభించిందని తెలిపా రు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని, ఆదిలాబాద్ పట్ట ణం ఆదర్శనగర్ కాలనికి చెంది న నిందితుడు రెహమాన్‌ను అరెస్టు చేసి ఆదిలాబాద్ గ్రామీణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఖాతాల తిరస్కరణ.. కూలీలకు వేతన వెత

ఆదిలాబాద్ : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించి బాధ్యతలు రాష్ట్రం నుంచి కేంద్రం చేతుల్లోకి బదిలీ కావడంతో సాఫ్ట్‌వేర్ కూడా మారిపోయింది. దీంతో కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. మస్టర్ పేమెంట్‌లో ఏ ఒక్క కూలీ బ్యాంకు ఖాతా తప్పు ఉన్నా తిరస్కరణకు గురవుతోంది. దీంతో ఆ మస్టర్‌లో కూలీలందరికి వేతనాలు రావడం లేదు. బ్యాంకు కొత్త ఖాతాలు తప్పనిసరని అని నిబంధనలు ఉండడంతో కొత్త ఖాతాలు తీయించేందుకు కూలీలు, ఉపాధి అధికారులు అష్టకష్టాలు పడుతున్నారు. దీని కారణంగా ఏప్రిల్ నుంచి జిల్లాలో వేలాది మంది కూలీలకు వేతనాలు అందక ఆందోళన చెందుతున్నారు.గతంలో ఏ బ్యాంకు ఖాతా ఉన్నా కూలీకి వేతనం అందేది. కాని ఇప్పుడు కేంద్ర పరిధిలోకి వెళ్లాక కొత్త బ్యాంకు ఖాతా తప్పనిసరి చేసింది. కొంతమంది ఖాతాలు తీయగా మరి కొంత మంది పాత ఖాతాలను అధికారులకు ఇవ్వడంతో మస్టర్ పేమెంట్ సమయంలో ఆ అకౌంట్స్ తిరస్కరణకు గురవుతున్నాయి. ముఖ్యంగా కొత్త పంచాయతీల్లో సమస్య అధికంగా ఉంది. కొత్త పంచాయతీల వివరాలు కొత్త సాఫ్ట్‌వేర్‌లో అప్‌డేట్ కాకపోవడంతో.. ఆ పంచాయతీలోని కూలీల ఖాతాలు తిరస్కరణకు గురవుతున్నాయి. ఒక్కో మస్టర్‌లో 10 మంది కూలీలుండగా.. వీరిలో ఏ ఒక్కరి బ్యాంకు ఖాతా తప్పుగా ఉన్న మస్టర్‌లో ఎవరికి వేతనాలు అందడం లేదు. ఇలా జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 2794, గతేడాది 545 మస్టర్లు తిరస్కరణకు గురిఅయ్యాయి. భీంపూర్ మండలంలో అధికంగా 947 మస్టర్లు, మావలలో అత్యల్పంగా 30 మాస్టర్లు తిరస్కరణకు గురయ్యాయి.

బ్యాంకుల చుట్టు ప్రదక్షిణలు..

రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పథకం ఉన్నప్పుడు రాగస్ అనే సాఫ్ట్‌వేర్‌ను వినియోగించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ పథకం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో వెళ్లగా వారు ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నారు. ఇందులో కొత్త ఖాతాలు తప్పనిసరి కావడంతో బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న మస్టర్ల సమస్యను పరిష్కరించడంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. తిరస్కరణకు గురైన మస్టర్లలో ఏ కూలీ ఖాతా సమస్య ఉందో గుర్తించి వారితో కొత్త ఖాతాలను తెరిపిస్తున్నారు. వేసవి ప్రారంభమయ్యాక ఫిబ్రవరి నుంచి గతంలో కొంత భత్యం చెల్లించగా.. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ బదిలీ కావడంతో ఈ ఆప్షన్లు ఏవీ కనిపించడం లేదు. దీంతో ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మేలో 30, జూన్‌లో 20 శాతం భత్యాలను కూలీలు కోల్పోయారు. ఈ లెక్కన ఒక్కో కూలీ సుమారు రూ.3,000లను నష్టపోయారు.

కొత్త ఖాతాలతో నమోదు చేయిస్తున్నాం

కిషన్, డీఆర్‌డీఓ, ఆదిలాబాద్

ఖాతా తిరస్కరణకు గురైన ఉపాధి కూలీల చేత స్థానికంగా ఉన్న బ్యాంకుల్లో కొత్త ఖాతాలు తీయిస్తున్నాం. దీనిపై మండల స్థాయిలో అధికారులకు రోజువారీగా లక్ష్యాలను నిర్దేశించాం. కొత్తగా ఖాతాలు తీయించిన వారి వివరాలను ఎప్పటికప్పుడు సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయిస్తున్నాం. నమోదు ప్రక్రియ పూర్తిగా కాగానే వారం రోజుల్లో వేతనాలు జమవుతున్నాయి. పని చేసిన కూలీలందరికి వేతనాలు అందుతాయి.

వీరు బేల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వేతనాల కోసం ఇటీవల ఆందోళన చేపట్టిన పిట్‌గావ్ కూలీలు. ఇది కొత్త పంచాయతీగా ఏర్పడగా మస్టర్ పేమెంట్ సమయంలో ఖాతాలన్నీ తిరస్కరణకు గురికావడంతో రెండు నెలలు వేతనాలు అందలేదు. ఆ తర్వాత పంచాయతీ కార్యదర్శి, ఉపాధి అధికారులు వీరి చేత కొత్త ఖాతాలు తెరిపించారు. మస్టర్ పేమేంట్ చేయడంతో ఇప్పటి వరకు 60 శాతం కూలీలకు వేతనాలు అందాయి.

## అపురూప సందర్భం.. జాడలేని 'ఏకరూపం'

ఆసిఫాబాద్: దేశమంతా స్వాతంత్ర్య వజ్రోత్సవాలకోసం ముస్తాబవుతోంది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఉత్సవాలను రెండు వారాలపాటు ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. పాఠశాల విద్యార్థులను సైతం ఇందులో భాగస్వాములను చేస్తున్నారు. ఇలాంటి కీలక సందర్భంలో వస్తున్న జెండా పండుగకు కూడా గిరిజన విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందలేదు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక బడుల్లో పిల్లలు ఇంటి నుంచి తెచ్చుకుంటున్న రంగుల దుస్తులే వేసుకొని తరగతులకు హాజరవుతున్నారు. కొన్నిచోట్ల ఏకరూప వస్త్రం వచ్చినా పంపిణీ చేయడంలో, దర్జీలకు ఇచ్చి కుట్టించడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వహించడంతో పంద్రాగస్టుకు సైతం చిన్నారులు పాత దుస్తులతోనే హాజరుకావాల్సి దుస్థితి నెలకొంది. ఏటా నాలుగు జతల దుస్తులను గిరిజన పాఠశాలలు ప్రారంభమైన కొద్ది రోజులకే అధికారులు అందించే ఏర్పాట్లు చేసేవారు. రెండేళ్లుగా కొవిడ్ వల్ల పంపిణీ చేయలేదు. ఈ సారి కూడా విపరీతమైన జాప్యం జరుగుతోంది.జడ్పీ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో సైతం ఏకరూప దుస్తులకు సంబంధించి వస్త్రాలు పంపిణీ జరిగినా కుట్టు పనులు పూర్తి కాలేదు. రెండు జతలకు సంబంధించి వస్త్రాలు ఇవ్వాల్సి ఉండగా, అనేక మండలాల్లో కేవలం ఒక జతకు మాత్రమే సరిపడా మాత్రమే అందినట్లు చెబుతున్నారు. వీరికి అందించే దుస్తులను 70 శాతం మహిళా సంఘాలు, 30 శాతం బయట దర్జీలకు ఇచ్చి కుట్టించి ఇవ్వాలనే నిబంధలను ఉన్నాయి. ఒక్కో జత దుస్తులు కుట్టడానికి అధికారులు రూ.50 మాత్రమే చెల్లించడంతో గిట్టుబాటు కాదని అనేక మండలాల్లో కుట్టడానికి మహిళా సంఘాల సభ్యులు ముందుకు రావడం లేదు. గతంలో సైతం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులే తలా కొంత పోగు చేసిన డబ్బులతో దుస్తులను కుట్టించి విద్యార్థులకు అందించారు.

పంద్రాగస్టుకూ అనుమానమే

కుట్టు కూలీ ధర తక్కువ చెల్లించడంతో అనేకచోట్ల ఈ ఏకరూప దుస్తులు స్వల్పకాలంలోనే చినిగిపోయేవి. కొలతలు సైతం ఇష్టానుసారంగా ఉండటం వల్ల గుండీలు ఊడిపోవడం, ప్యాంటు, చొక్కాలు పనికిరాకుండా పోయేవి. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వాతంత్ర్య వజ్రోత్సవాల సంబరాలకైనా మంచి దుస్తులు అందుతాయి అనుకుంటే నిరాశే ఎదురయ్యేలా ఉంది.

ఉమ్మడి జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ అధ్వర్యంలో 1,037 వసతిగృహాలు, ప్రాథమిక పాఠశాలలు ఉండగా 55,144 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ జడ్పీ, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు 2,847ఉండగా, 2.10 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరూ నూతన దుస్తుల కోసం ఎదురు చూస్తున్నారు.

అవసరమైతే రెడీమేడ్‌వి అందిస్తాం..మణెమ్మ, జిల్లా గిరిజన సంక్షేమాధికారి, కుమురం భీం గిరిజన పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఈ పంద్రాగస్టుకు దుస్తులను పంపిణీ చేసే అవకాశం ఉంది. ఇప్పటికైతే వస్త్రాలు ఇంకా రాలేదు. ఉన్నతాధికారుల సూచనలతో రెడీమేడ్‌వి అందించేందుకు కృషి చేస్తాం.

## అనుమతులు వచ్చేనా...?



మంచిర్యాల : మంచిర్యాల వైద్య కళాశాలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) అనుమతుల జారీపై అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ మేరకు జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీకి పునాది పడింది. జిల్లా కేంద్రంలోని వ్యవ సాయ శాఖ బీట్ మార్కెట్ ఆవరణను వైద్య కళాశాలకు కేటాయించారు. బీట్ మార్కెట్ గోదాములకు మార్పులు, చేర్పులు చేసి కళాశాల కోసం వినియోగించనుండగా తరగతి గదులు ఇతరత్రా అవసరాల కోసం రూ. 11 కోట్ల వ్యయంతో నూతన నిర్మాణాలను సైతం చేపట్టారు. కళాశాల నిర్వహణకు అవసరమైన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోగా అనుమతులు లభించడమే మిగిలి ఉంది. ఎన్‌ఎంసీ బృందం ఇప్పటికి రెండు సార్లు కళాశాలను తనిఖీ చేసి సంతృప్తి చెందకపోగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించింది. దీంతో ఆ మేరకు పనులు సైతం పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎన్‌ఎంసీ సూచనతో మార్పులుఎన్‌ఎంసీ బృందం రెండుసార్లు పర్యటనలో సూచించిన విధంగా అధికారులు వైద్య కళాశాలలో మార్పులు చేర్పులు చేపట్టినప్పటికీ మూడో విడత తనిఖీలపైనే సర్వత్రా ఆధారపడి ఉన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి త్వరలో విద్యా సంవత్సరం ఆరంభం కానుండగా ఈలోపు ఎన్‌ఎంసీ బృందం మూడో విడత తనిఖీలు చేపట్టనుంది. ఆ తనిఖీల్లో నిబంధనల మేరకు ఏర్పాట్లు ఉంటేనే అనుమతులు లభించే అవకాశాలు ఉన్నాయి. రానున్న వారం రోజుల్లో ఎన్‌ఎంసీ తనిఖీలు ఉండే అవకాశాలు ఉన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎండీ సులేమాన్ సూచనప్రాయంగా తెలిపారు. తరగతుల బోధనకు సంబం?దించి ప్రిన్సిపల్, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, తదితర సిబ్బంది నియామకం జరిగింది. ఇదిలా ఉండగా మంచిర్యాల కళాశాలతో పాటు లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్‌వోపీ) కోసం దరఖాస్తు చేసుకున్న కళాశాలల్లో సంగారెడ్డి, వనపర్తి, కొత్తగూడెం, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, రామగుండం, వైద్య కళాశాలలకు అనుమతులు రావాల్సి ఉంది. వీటిలో నాగర్‌కర్నూల్ కళాశాలకు ఈ ఏడాది అడ్మిషన్‌లకు ఎన్‌ఎంసీ అంగీకారం తెలిపింది. కౌన్సెలింగ్ నాటికి వచ్చేనా...?జూలై 17న నీట్ పరీక్ష జరగగా పది రోజుల్లో ఫలితాలు రానున్నాయి. అనంతరం నెల రోజుల్లోపు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆలోపు మంచిర్యాల కళాశాలకు ఎన్‌ఎంసీ అనుమతులు లభిస్తాయో లేదో అనే సందేహం నెలకొంది. కౌన్సెలింగ్‌కు ముందే కొత్త కళాశాలలన్నింటికి ఎన్‌ఎంసీ నుంచి అనుమతులు రావాల్సి ఉంది. అనుమతులు వస్తేనే అడ్మిషన్‌ల ప్రక్రియ చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. ఒకవేళ ఏదైనా కారణంతో ఎల్‌ఓపీ ఆలస్యమైతే విద్యార్థులకు నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యే నాటికి ఎల్‌వోపీ వస్తే రిజిస్ట్రేషన్ చేసుకొని విద్యార్థులు వెబ్ ఆప్షన్‌లు ఇచ్చేం దుకు అవకాశం ఉంటుంది. వైద్య విద్య అభ్యసించే వారిలో తమ నివాస ప్రాంతాలకు దగ్గరగా ఉండేలా కళాశాలను ఎంపిక చేసుకునే అవకాశా లుంటాయి. అందుకు తగ్గట్టుగా వెబ్ ఆప్షన్‌లు పెట్టుకుంటారు. ఎల్‌ఓపీ వస్తే మంచిర్యాల కళాశాలలో ప్రథమ సంవత్సరానికి సంబం?ధించి 150 సీట్లు అందుబాటులో ఉంటాయి. దీంతో ఎన్‌ఎంసీ అనుమతులపైనే ఇక్కడి విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు. ఏర్పాట్లు పూర్తి చేశాం....డా. ఎండీ సులేమాన్, ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల వైద్య కళాశాలకు ఎన్‌ఎంసీ అనుమతులు వచ్చేలా అవసరమైన ఏర్పాట్లన్ని సిద్ధం చేశాం. కళాశాలకు అనుమతులు వస్తే ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో 150 మంది విద్యార్థులు చేరేందుకు అవకాశం ఏర్పడుతుంది. విద్యార్థుల ఉపయోగార్థం అనుమతులు త్వరగా వచ్చేలా ప్రయత్నిస్తున్నాం. తరగతుల బోధనకు ప్రస్తుతం కళాశాల సిద్ధంగా ఉంది. ఎన్‌ఎంసీ సూచనల మేరకు అవసరమైన మార్పులు, చేర్పులు చేయడం జరిగింది. అనుమతులు అనుకూలంగా వస్తాయనే ఆశాభావంలో ఉన్నాం.

## శ్మశానవాటిక.. సమస్యల వేదిక

ఆదిలాబాద్ :ప్రజలకు లబ్ధి చేకూర్చడమే పథకాల లక్ష్యం. దీని కోసం ప్రభుత్వం రూ.లక్షల్లో నిధులు కేటాయిస్తోంది. కానీ కొంత మంది నిర్లక్ష్యం.. ప్రణాళికలేమి కారణంగా కొన్ని నిరుపయోగంగా మారుతున్నాయి. రూ.లక్షల ప్రజాధానం వృథా అవుతోంది. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో నిర్మించిన శ్మశావాటికలు అదే కోవలోకి వస్తాయి. కనీసం విద్యుత్తు సరఫరాలేక, నాసిరకం నిర్మాణాలు, వెళ్లేందుకు సరైన మార్గం లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మించారు. దీంతో చాలా చోట్ల అవి వినియోగించలేని పరిస్థితి నెలకొంది.జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో శ్మశాన వాటికలు నిర్మించారు. ఒక్కో దానికి రూ.12 లక్షలు ఖర్చు చేశారు. క్షేత్రస్థాయిలో వీటి నిర్వహణ లేక ఎందుకు పనికి రాకుండా ఉన్నాయి. అధికారుల స్పందించి అన్ని వసతులు కల్పించి ప్రజలకు వినియోగించేలా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిధులు వరద పాలు

జిల్లాలో కొన్ని చోట్ల వాగుల సమీపంలో వైకుంఠధామాలను నిర్మించారు. వాగులు ఉప్పొంగినప్పుడు నీరు చేరడం, బురద పేరుకుపోవడంతో వినియోగించలేని పరిస్థితి. దహెగాం మండలంలోని లగ్గాం, చౌక గ్రామపంచాయతీకి సంబంధించిన శ్మశాన



వాటికలు పెద్దవాగు సమీపంలో నిర్మించారు. ఇటీవల పెద్దవాగు వరద బీభత్సానికి పూర్తిగా నీటమునిగింది. కొన్నిచోట్ల నిర్మాణాలు ఆనవాళు లేకుండా కొట్టుకుపోయాయి. మళ్లీ మరమ్మతులకు రూ.లక్షలు ఖర్చు చేయాల్సిందే. దుస్తులు మార్చుకునే గదులు సైతం మొత్తం బురదతో నిండిపోయాయి.

విద్యుత్తు సరఫరాలేదు..

మరికొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తైనా.. విద్యుత్తు సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చాలాచోట్ల బోర్లు వేసి ఉంచారు కానీ విద్యుత్తు సరఫరా లేకపోవడంతో బోరు నీటిని వాడలేని పరిస్థితి. కొన్ని చోట్ల విద్యుత్తు లైన్లకు సుదూరంగా ఉన్న ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లిలో నిర్మించిన శ్మశానవాటిక గ్రామానికి అందుబాటులో ఉన్నా విద్యుత్తు సౌకర్యంలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్తు సరఫరా అయ్యేలా ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరుగుతుంది.

దారులు అధ్వానం..రహదారులు అభివృద్ధికి జీవనాడులు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించినా రహదారులు లేకపోవడంతో అక్కడికి చేరుకోలేని పరిస్థితి. ఈ చిత్రంలో కనిపిస్తున్నది బొంబాయిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని శ్మశానవాటికను చేరుకునే దారి. జిల్లాలో అనేక చోట్ల పరిస్థితి ఇలాగే ఉంది. అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో అనేక చోట్ల పనులు అస్థవ్యస్తంగా ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆయా గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

## కన్ను మూసినా.. కాటికెళ్లలేక..!

మంచిర్యాల : రాష్ట్రంలోనే ఎక్కడా.. ఇలాంటి కష్టాలు ఉండవేమో.. చిన్న చిన్న గ్రామాల్లోనూ వైకుంఠధామాలు నిర్మించారు.. కానీ దాదాపు రెండు లక్షలకు పైగా జనాభా, అంతకుమించి జిల్లా కేంద్రం అయిన మంచిర్యాల మాత్రం ఇప్పటి వరకు నోచుకోలేదు. అంతిమ యాత్రకు అష్టకష్టాలు పడుతూనే ఉన్నారు. పట్టణానికి నాలుగు మంజూరైనా ఒక్కటీ వినియోగంలోకి రాలేదు. పాతమంచిర్యాల, అండాలమ్మకాలనీ, రాజీవ్‌నగర్, గోదావరితీరంలో ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఒక్కో చోట ఒక్కో కారణంతో వాయిదా పడుతూ, ఒక్కో దశలో నిర్మాణం ఆగిపోతున్నాయి. ముఖ్యంగా గోదావరినది ప్రాంతంలో అత్యవసరం కాగా స్థలసేకరణలోనే అధికార యంత్రాంగం అవస్థలు పడుతోంది. ఇటీవల దాదాపు ఎకరం భూమిని కొనుగోలుకు సిద్ధం కాగా వరదల్లో ఆ స్థలం కాస్త ముంపునకు గురికావడంతో వాయిదా పడ్డట్లు సమాచారం.

ఊరటనిచ్చిన ప్రైవేటు వైకుంఠధామం సైతం..జిల్లా కేంద్రానికి చెందిన వ్యాపారి సుధాకర్.. ఇక్కడి ప్రజలు అంతిమయాత్రకు పడుతున్న ఇబ్బందులను చూసి కొన్నేళ్ల కిందట తన సొంత (సుమారు రెండు ఎకరాలు) స్థలంలో, సొంత ఖర్చులతో వైకుంఠధామం నిర్మించారు. నిర్వహణకు ఒకరిని నియామకం చేసి వేతనం అందించారు. మొన్నటి వరకు పట్టణవాసులు, ఇతర ప్రాంతాలకు చెందినవారికే కాకుండా గతేడాది కరోనా సమయంలో అనాథ శవాలకు సైతం ఉపయోగపడింది. ఇటీవల వచ్చిన వరదల కారణంగా ఈ ప్రాంతం మొత్తం మునిగిపోవడం, అందుబాటులో ఉన్న రేకుల షెడ్లు, ఇతర సదుపాయాలు నీటి ఉద్ధృతితో కొట్టుకుపోవడంతో వినియోగించే పరిస్థితి లేకుండా పోయింది. ప్రస్తుతం నీరు లేకపోయినా ఉపయోగించుకునేందుకు దారి సక్రమంగా లేకపోవడం, సౌకర్యాలు అస్తవ్యస్తంగా మారడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సౌకర్యాలులేక సతమతం..

వైకుంఠధామం అందుబాటులో లేక, ఆ తర్వాత కార్యక్రమాలకు సదుపాయాలు లేక అంతిమయాత్ర కోసం వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారపార్టీ నాయకులు, సంబంధిత ఏర్పాట్లు చేయాల్సిన ప్రభుత్వశాఖ పట్టించుకోవడం లేదు. గోదావరినదికి వెళ్లే ప్రధాన దారి పక్కనే అవస్థలు పడుతూ దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. ఈ స్థలం కూడా ప్రైవేటు వ్యక్తికి చెందినది కావడం, ఆయన సైతం మానవత్వంతో ముందుకొచ్చి వినియోగించుకోవాలని సూచించడంతో కొంత ఉపశమనం కలుగుతోంది. ప్రధానదారికి అతిసమీపంలో శవాలను కాలుస్తుండటంతో పలువురు ఆందోళన చెందుతున్నారు. నిత్యం గోదావరికి అంతిమయాత్రకే కాకుండా పుణ్యస్నానాలకు సైతం భక్తులు వస్తుంటారు. ఇలా వచ్చినవారిలో కొంతమంది అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నిర్మిస్తారా.. మరమ్మతుల చేస్తారా..నూతనంగా నిర్మాణం చేపట్టే వరకు ఇక్కడి పురపాలికలోని ప్రైవేటు వ్యక్తికి చెందిన వైకుంఠధామాన్ని ఆయన అనుమతితో వినియోగంలోకి తీసుకొస్తే ఉపయోగపడుతుందని పట్టణవాసులు అభిప్రాయపడుతు న్నారు. అన్ని సౌకర్యాలు ఉన్నా ఆ ప్రాంతానికి కొంత మరమ్మతులు చేయిస్తే కొన్నిరోజుల వరకు ఎలాంటి సమస్య ఉండదంటున్నారు. ఆ చోటుకు వెళ్లే దారిని సైతం శుభ్రం చేయిస్తే ప్రయోజనం చేకూరుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దశగా ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.





# ఎంపీ అవినాష్ రెడ్డికి సుప్రీం నోటీసులు

దిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న కడప ఎంపీ అవినాష్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మే 31న తెలంగాణ హైకోర్టు ఆయనకు మంజూరు చేసిన ముందస్తు బెయిల్ ఆదేశాలను సవాల్ చేస్తూ వివేకా కుమార్తె సునీతా నర్రెడ్డి సుప్రీంను ఆశ్రయించిన విషయం తెలిసిందే.ఆ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన ధర్మాసనం.. అవినాష్‌కు నోటీసులు ఇచ్చింది. సునీత పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను జులై 3కి వాయిదా వేసింది.

# మన కుర్రోడికి అభినందనలు.. చిరాగ్‌కు శుభాకాంక్షలు: సీఎం వైఎస్ జగన్ ట్వీట్





గుంటూరు: ఇండోనేసియా ఓపెన్ టైటిల్ గెలిచిన సాత్విక్-చిరాగ్ శెట్టి జోడీని సీఎం జగన్ ట్విటర్ వేదికగా మరోసారి అభినందించారు. మన తెలుగు కుర్రాడు సాత్విక్‌సాయిరాజ్‌తో పాటు అతనికి జోడీగా టైటిల్ నెగ్గిన శెట్టి చిరాగ్‌కు సైతం సీఎం జగన్ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలుగు తేజం సాత్విక్‌సాయిరాజ్‌కి, అలాగే చిరాగ్ శెట్టిలకు శుభాకాంక్షలు. అందరూ గర్వపడేలా గెలుపొందారంటూ ట్వీట్ చేశారాయన. అంతకు ముందు ఒక ప్రకటన ద్వారా.. భవిష్యత్తులో ఈ జోడీ మరిన్ని విజయాలు సాధించాలని సీఎం జగన్ ఆకాంక్షించిన సంగతి తెలిసిందే.

ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టైటిల్‌ను భారత పురుషుల బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్ -చిరాగ్ శెట్టి నెగ్గడం ద్వారా చరిత్ర సృష్టించారు. ఆదివారం జరిగిన ఫైనల్లో ఈ భారత ద్వయం.. వరల్డ్ ఛాంపియన్స్ ఆరోన్ చియా-వూయ్ ఇక్ సోహ్ (మలేసియా) జోడీపై వరుస సెట్లలో (21-17, 21-18) విజయం సాధించి, స్వర్ణ పతకం చేజిక్కించుకున్నారు.

# అమర్నాథ్ కుటుంబానికి ప్రభుత్వం అండ

## సీఎం ఆదేశాల మేరకు రూ.10 లక్షలు ఆర్థికసాయం



బాపట్ల: బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారి పాలెం గ్రామానికి చెందిన అమర్నాథ్ కుటుంబానికి అండగా ప్రభుత్వం నిలిచింది. ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆదేశాల ప్రకారం ఆ కుటుంబానికి10 లక్షలు ఆర్థిక సాయాన్ని మంత్రి జోగి రమేష్. ఎంపీ మోపిదేవి వెంకటరమణ చేతుల మీదుగా అందజేశారు. అలాగే బాధిత కుటుంబానికి పక్కా ఇళ్లు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే విధంగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. కుల రాజకీయాలు చేసి లబ్ధిపొందేందుకు కుట్రలు చేయడం టీడీపీ అధినేత చంద్రబాబుకు, ఆ పార్టీ ఎమ్మెల్యేలకు అలవాటేనని తీవ్ర స్థాయిలో విమర్శించారు. అమర్‌నాథ్ మృతిని అడ్డుపెట్టుకుని రాయకీయ లబ్ధిపొందేందుకు చంద్రబాబు కుట్రలకు తెరతీయడం, ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ప్రవర్తన సిగ్గు చేటని పేర్కొన్నారు. గౌడ కులస్తులను, బీసీలను చంద్రబాబు గతంలో ఎలా మోసం చేశారో అందరికీ తెలుసని ధ్వజమెత్తారు. సీఎం వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాల అమలులో కులాలు చూడడం లేదని స్పష్టం చేశారు. సంక్షేమ ప్రభుత్వంపై చంద్రబాబు అండ్ కో బురద జల్లేందుకు యత్నిస్తోందని, ఇందులో కుల సంఘాల నాయకులు పావులుగా మారకూడదని హితవుపలికారు. బీసీలకు సీఎం వైయస్ జగన్ అధిక ప్రాధాన్యమిస్తున్నారని, అందరూ జగనన్నకు అండగా నిలవాలని కోరారు. అమర్‌నాథ్ మృతి తర్వాత ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు ఆ కుటుంబానికి అండగా నిలిచారని గుర్తు చేశారు.


**కుట్రలకు ప్రతిరూపం అనగాని : మోపిదేవి :** టీడీపీ అధికారంలో ఉండగా గుడ్డికాయలంకకు చెందిన గౌడ కులానికి చెందిన వ్యక్తిని పోలీసులు లాకప్ డెత్ చేస్తే అప్పటి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్‌కు తొత్తుగా పనిచేస్తున్న సీఐని రక్షించి బాధిత కుటుంబానికి అన్యాయం చేయటం రేపల్లె నియోజకవర్గ ప్రజలు మరువలేదని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు విమర్శించారు. పేటేరులో గౌడ కులానికి చెందిన వ్యక్తిని హత్య చేస్తే నేరస్తులకు అండగా నిలిచిన చరిత్ర అనగాని సత్యప్రసాద్‌దని గుర్తు చేశారు. అడవులదీవిలో గౌడ కులానికి చెందిన వ్యక్తిని హత్య చేస్తే బాధ్యులైన వారికి సహకరించింది అనగాని కాదా అని ప్రశ్నించారు. అలాగే ఇటీవల పట్టణంలో టీడీపీకి చెందిన కౌన్సిలర్‌ను ఆపార్టీ నాయకులే హత్య చేస్తే హంతకులకు వెన్నుదన్నుగా నిలిచిన నీచ సంస్కృతి అనగానిదని ధ్వజమెత్తారు. కుట్రలకు ప్రతిరూపం అనగాని అని దుయ్యబట్టారు. అమర్‌నాథ్ హత్య పాశవిక చర్యని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాగాన్ని కోరినట్టు మోపిదేవి వివరించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, నేతలు కామినేని కోటేశ్వరరావు, బొర్రా శ్రీనివాసరావు, చెన్ను కోటేశ్వరరావు, తాతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# నాతో సహా నేతలెవరూ పూర్తి స్థాయిలో పని చేయడం లేదు



అమరావతి : టీడీపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని.. కానీ తనతో సహా నేతలు ఎవరూ కూడా పూర్తి స్థాయిలో పని చేయడం లేదనే ఫీలింగ్ ఉందని టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వచ్చే రోజుల్లో ప్రజల్లో ఉండేలా కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. ఐదు జోన్లల్లో భవిష్యత్ గ్యారెంటీ అంశాలపై బస్సు యాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. సీఎం జగన్ అప్పులు తెచ్చి అరకొర సంక్షేమం చేశారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సంపద సృష్టించి పూర్తి సంక్షేమం చేస్తారన్నారు. దసరాకి విడుదల చేసే మేనిఫెస్టోలో ఉద్యోగులకు సంబంధించిన అంశాలుంటాయన్నారు. పార్టీ కార్యక్రమాలను.. ప్రచార కార్యక్రమాలను నేతలు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. చంద్రబాబుతో చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అచ్చెన్నాయుడు హితవు పలికారు.

# మరో వారం రోజులు ఒంటి పూట బడులు: మంత్రి బొత్స



కృష్ణా: పూర్తి పారదర్శకంగా ఉపాధ్యాయ బదిలీలు పూర్తి చేశామని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశమయ్యాం..వారి సహకారంతో విద్యా వ్యవస్థని మరింత పటిష్టం చేస్తామని చెప్పారు. 1.75 లక్షల మంది ఉపాధ్యాయులలో 82 వేల మంది బదిలీకి ధరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ఈ క్రమంలో 52 వేల మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని తెలిపారు. సీనియర్ హెడ్ మాస్టర్లని సెకండ్ ఎంఇఓలగా నియమించామని.. కొత్తగా 679 మంది సెకండ్ ఎంఇఓ పోస్టులని భర్తీ చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 355 ఎంఇఓ వన్ పోస్టులు ఖాళీలు ఉండగా వీటిని కూడా సీనియర్ హెడ్ మాస్టర్లతో భర్తీ చేస్తామన్నారు. వడగాల్పులు తీవ్రత దృష్ట్యా, సీఎం ఆదేశాలమేరకు మరో వారం రోజులు ఒంటి పూట బడులు పొడిగిస్తున్నట్లు తెలిపారు. మూడవ తరగతి నుంచి సబ్జెక్ట్ టీచర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 ఇంజనీరింగ్ ప్రొఫెసర్ల ద్వారా ఉపాధ్యాయులకి డిజిటల్ విద్యా బోధనపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రైమరీ స్థాయిలో పదివేల స్మార్ట్ టివీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సింగిల్ టీచర్లు ఉన్న పాఠశాలలు 9 వేలు ఉండగా.. సింగిల్ టీచర్ సెలవుపెట్టే పాఠశాలలకి అందుబాటులో ఉండేలా మండలానికి నలుగైదురు టీచర్లని ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి బొత్స తెలిపారు.



## ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ నేత

# హర్‌దీప్ కాల్చివేత

ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ చీఫ్, 'గురునానక్ సిక్ గురుద్వారా సాహిబ్' అధిపతి హర్‌దీప్ సింగ్ నిజ్జర్(46)ను ఆదివారం సాయంత్రం కెనడాలోని ఓ గురుద్వారాలో కాల్చి చంపారు. ఇద్దరు గుర్తుతెలియని యువకులు గురుద్వారా సాహిబ్ ప్రాంగణంలో ఈ దాడికి పాల్పడ్డారు. ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ సభ్యులకు.. కార్యకలాపాల నిర్వహణ, నెట్‌వర్క్ ఏర్పాటు చేయడం, శిక్షణ, ఆర్థిక సహకారం వంటివి హర్‌దీప్ అందిస్తాడు. ఇతడిపై జాతీయ దర్యాప్తు సంస్థ భారత్‌లో ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది.

హర్‌దీప్ సింగ్‌కు సిక్ ఫర్ జస్టిస్ సంస్థతో కూడా సన్నిహిత సంబంధాలున్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాలో ఖలిస్థాన్ మద్దతుదారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో కూడా ఇతడి హస్తం ఉంది. హర్‌దీప్ సామాజిక మాధ్యమ ఖాతాల్లో విద్వేషపూరిత ప్రసంగాలు, చిత్రాలు ఉన్నాయి. గతంలో పంజాబ్ ముఖ్యమంత్రిగా అమరీందర్ సింగ్ ఉన్న సమయంలో కెనడాకు అప్పగించిన మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఇతడి పేరును కూడా చేర్చారు. 2018లో ఈ జాబితాను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు అప్పగించారు. పంజాబ్ రాష్ట్రంలో కూడా హిర్‌దీప్ సింగ్‌పై చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే అతడిపై రెడ్‌కార్నర్ నోటీస్ జారీ అయ్యింది.

హర్‌దీప్ పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లోని బహర్ సింగ్ పుర గ్రామానికి చెందిన వ్యక్తి. అతడికి చెందిన భూమిని పంజాబ్ ప్రభుత్వం సీజ్ చేసింది. ప్రస్తుతం హర్‌దీప్ సింగ్ కుటుంబీకులు ఎవరూ స్వగ్రామంలో లేరు. ఖలిస్థాన్ లిబరేషన్ ఫోర్స్ (కేఎల్ఎఫ్) నేత అవతార్‌సింగ్ ఖాండా (35) బ్రిటన్‌లోని ఓ ఆస్పత్రిలో గత గురువారం మరణించాడు. 'వారిస్ పంజాబ్ దే' అధినేత అమృత్‌పాల్ సింగ్ పరారీ సమయంలో సాయం చేసింది ఇతడే. తీవ్ర అస్వస్థతతో బర్మింగ్‌హామ్‌లోని ఓ వైద్యశాలలో మృతి చెందాడు.



# పవన్.. దమ్ముంటే నాపై పోటీ చెయ్!

కాకినాడ: తనను విమర్శించేస్థాయి జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు లేదని వైకాపా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. తాను మూడు సార్లు పోటీ చేస్తే రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచానని.. పవన్ రెండు చోట్లా పోటీ చేసి ఓడిపోయారని విమర్శించారు. 'వారాహి' యాత్రలో భాగంగా పవన్ చేసిన విమర్శలపై చంద్రశేఖర్‌రెడ్డి స్పందించారు. కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో పవన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "పొలిటికల్‌గా పవన్ జీరో. ఆయన అజెండా ఏంటి? ప్రజలకు ఏం చేయాలనుకుంటున్నారు? ప్రజలు అమాయకులనుకుంటున్నారా? మార్చి 14న సీఎం అయ్యే అర్హత లేదని చెప్పి పవన్.. సరిగ్గా మూడు నెలల తర్వాత జూన్ 14న కత్తిపూడి సభలో మాట మార్చారు. ఇప్పుడు ఎమ్మెల్యే, సీఎంను చేయండి అని అడుగుతున్నారు. సీట్ల సర్దుబాటు కుదరకపోవడంతోనే ఆయన మాటమార్చారు. నాపై చేసిన ఆరోపణలను పవన్ నిరూపించాలి. కాకినాడలో గత 50 ఏళ్లుగా వ్యాపారాలు చేసుకుంటున్నాం. సామాజికవర్గం పరంగా ఎలాంటి బలం లేకపోయినా ఇక్కడి ప్రజలు రెండు సార్లు గెలిపించారు. కాకినాడలో నన్ను ఓడించడం పవన్ వల్ల కాదు. నన్ను ఓడిస్తానని ఆయన చేసిన ఛాలెంజ్‌ను నేను స్వీకరిస్తున్నా. దమ్ముంటే కాకినాడలో నాపై పవన్ పోటీ చేయాలి.. ఆయన్ను తుక్కుతుక్కుగా ఓడిస్తా. పవన్ ఎమ్మెల్యే, సీఎం అవ్వాలంటే ఆయనకు సినిమాల్లోనే సాధ్యం" అని ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# తిరుమల శ్రీవాణి ట్రస్టుపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు..




అమరావతి : తిరుమల శ్రీవాణి ట్రస్టుపై టీడీపీ అధినేత చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. తిరుమల వెంకన్నకు అపచారం తలపెడుతున్నారన్నారు. శ్రీవాణి ట్రస్ట నిర్వహించేది ఎవరని ప్రశ్నించారు. శ్రీవాణి టిక్కెట్లకు రిసీట్లు ఇవ్వడం లేదన్నారు. రిసీట్లు లేకుండా తీసుకుంటున్న డబ్బులు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. వెంకన్నకు అపచారం చేస్తే.. పుట్టగతులు ఉండవన్నారు. వెంకన్న జోలికి వస్తే వచ్చే జన్మలో కాదు.. ఈ జన్మలోనే శిక్ష పడుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇప్పుడు ఈ ప్రభుత్వం ఏదో బటన్ నొక్కుతానంటోందన్నారు. బటన్ నొక్కే వ్యవస్థని తెచ్చిందే టీడీపీ అని చంద్రబాబు అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రకటించాక జగన్‌కు ఏం చేయాలో తెలియడం లేదన్నారు. మళ్లీ వైసీపీ గెలవకూడదన్నారు. మళ్లీ వైసీపీ గెలిస్తే గౌరవం ఉన్న వాడెవ్వడూ ఏపీలో ఉండబోడన్నారు. ఏ పోలీస్ గోడ దూకుతాడో.. ఏ వైసీపీ గుండా ఇంట్లోకి వస్తాడోనని భయపడుతూ ఉండాలన్నారు. టీడీపీది ఒరిజినాలిటీతో ఉండే పార్టీ అని.. వైసీపీది అతుకుల బొంత అని చంద్రబాబు పేర్కొన్నారు. బాపట్లలో 15ఏళ్ల పిల్లాడిపై పెట్రోల్ పోసి దారుణంగా హత్య చేసిన ఘటనపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... ఏపీలో శాంతి భద్రతలు లేనే లేవన్నారు. తన అక్కను వేధిస్తున్నారని ప్రశ్నిస్తే ఓ పదో క్లాస్ పిల్లాడి నోట్లో గుడ్డలు కుక్కి పెట్రోల్ పోసి తగులపెట్టారని అన్నారు. గంజాయి తాగిన వెధవలు ఇలాంటి పని చేశారని.. అలాంటి వెధవలను సీఎం జగన్ తయారు చేస్తున్నారని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గంజాయి తాగే వెధవలకు తల్లికి చెల్లికి తేడా తెలియదన్నారు. ఇలాంటి వారిని రోడ్ల మీదకు వదిలేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఎంపీ ఫ్యామ్లీనే కిడ్నాప్ చేశారన్నారు. విశాఖలో అక్రమాలకు భయపడి ఎంపీ ఎంవీవీ తన ఆఫీసును హైదరాబాదుకు మార్చుకున్నారని తెలిపారు. ఏపీలో ఉండలేమని అధికార పార్టీ ఎంపీనే హైదరాబాదుకు వెళ్లిపోయారని వ్యాఖ్యలు చేశారు. ఏపీలో గన్ చూపించి ఆస్తులు రాయించుకునే పరిస్థితి ఉందన్నారు. ఏపీలో అవినీతి, అసమర్థ, నేరస్తుల పాలన ఉందని టీడీపీ అధినేత తెలిపారు.

# దుర్గమ్మకు ఘనంగా ఆషాడమాసం సారె



విజయవాడ : ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో ఆషాడమాసం సారె ఘనంగా ప్రారంభమైంది. తొలి రోజు వైదిక కమిటీకి సభ్యుల చేతుల మీదుగా అమ్మవారికి ఆషాడ మాసం సారె సమర్పించారు. మేళ తాళాలతో, మంగళ వాయిద్యాల నడుమ కనకదుర్గ నగర్ నుంచి భారీ ఊరేగింపుగా అమ్మవారికి వైదిక కమిటీ సభ్యులు సారెను సమర్పించారు. వారాహి నవరాత్రులలో భాగంగా అమ్మవారికి పసుపు, కుంకుమ పువ్వులు, గాజులు, చలిమిడి, చీర జాకెట్‌ను అమ్మవారికి సమర్పించడం జరిగింది. దేశం సస్యశ్యామలంగా ఉండి పాడిపంటలతో అభివృద్ధి చెందేందుకు ఆషాడ మాసం సారెను సమర్పిస్తామన్నారు. ప్రతి ఏడాది ఆషాడమాసంలో శాకంబరీ ఉత్సవాలను నిర్వహిస్తారు. జులై 1, 2, 3 తేదీల్లో ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు జరగనున్నాయి. వివిధ శాఖలతో మూడు రోజులపాటు దుర్గమ్మ దర్శనం ఇవనున్నారు. ఈ ఆషాడ మాసంలో హైదరాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల కమిటీ అమ్మవారికి బంగారపు బోనం సమర్పించారు.

# పవన్‌కు చంద్రబాబు వల్లే ప్రాణహాని: పేర్ని నాని



విజయవాడ: ప్రాణహాని అంటూ పవన్ కళ్యాణ్ సొల్లు కబుర్లు చెబుతున్నాడని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. ప్రాణహాని ఉంటే ఏనాడైనా పోలీసులకు పవన్ చెప్పాడా అని ప్రశ్నించారు. ఆయనకు చంద్రబాబు వల్లే ప్రాణహాని ఉందని అన్నారు. పవన్ సినిమాల్లో తప్ప బయట ఎవడిని కొట్టలేదని దుయ్యబట్టారు. తన దగ్గర పనిచేసే సిబ్బందిని తప్ప ఎవడ్ని కొట్టలేడంటూ ఎద్దేవా చేశారు. అరాచకంగా పాలించిన చంద్రబాబుని ఏనాడైనా పవన్ కొట్టాడా అని నిలదీశారు. 'లోకేష్ అవినీతి పరుడని గతంలో పవన్ కల్యాణ్ ఆరోపించలేదా?. లోకేష్‌ను గుడ్డలిప్పి కొట్టగలిగాడా. పవన్‌ది రౌడీ మనస్తత్వం.. అందుకే అలా మాట్లాడుతున్నాడు. చంద్రబాబుతో పొత్తు అనగానే పవన్ వెనకాల కాపులు తిరగడం మానేశారు. కాపులను మోసం చేయడం కోసం సీఎం అవుతానని పవన్ అంటున్నాడు. ఎన్నికల ముందు చంద్రబాబుతో పవన్ కలిసిపోవడం ఖాయం. సీఎం జగన్‌ను ఎదుర్కోవడం పవన్ కల్యాణ్ వల్ల కాదు' అని పేర్ని నాని పేర్కొన్నారు.

## బ్లాక్ డ్రెస్ లో డార్క్ ఏంజిల్ గా మృణాల్ ఠాకూర్

సీతారామం సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన అందాల భామ మృణాల్ ఠాకూర్. ఈ అమ్మడు మొదటి సినిమాతోనే నటిగా తన పెర్ఫార్మెన్స్ తో ప్రశంసలు సొంతం చేసుకుంది. కెరియర్ లో మరిచిపోలేని సక్సెస్ ను సొంతం చేసుకుంది. సీతారామం సినిమా ఈ దశాబ్దంలో వచ్చిన క్లాసిక్ మూవీ అనే గుర్తింపుని సొంతం చేసుకోవడంతో మృణాల్ కి అన్ని పాన్ ఇండియా ఇమేజ్ ని అందించింది. ఇదిలా ఉంటే ఈ మూవీ తర్వాత నేచురల్ స్టార్ నానికి జోడీగా మృణాల్ నటించబోతోంది. ఈ మూవీ షూటింగ్ స్టార్ట్ అయ్యింది. సినిమాలలో కాస్తా పద్ధతైన పాత్రలలో నటించే హీరోయిన్స్ అందరూ బయట అంతే పద్ధతి ఉంటారని మాత్రం అనుకోకూడదు.



మృణాల్ ఠాకూర్ కూడా అంతే. ఈ బ్యూటీ బయట అల్ట్రా మోడ్రన్ గానే ఎక్కువగా కనిపించడానికి ఇష్టపడుతుంది. ట్రెడిషనల్ కాస్ట్యూమ్స్ లో కంటే వెస్ట్రన్ వేర్స్ లోనే ఎక్కువగా కనిపించడానికి ఆసక్తి చూపిస్తుంది. అలాగే సిల్వర్ స్క్రీన్ పై కమర్షియల్ హీరోయిన్ గా సక్సెస్ కావాలంటే అందాల ప్రదర్శన చేయాల్సిందే అనే విషయాన్ని ఈ అమ్మడు బలంగా నమ్ముతుంది. అందుకే రెగ్యులర్ గాహాట్ హాట్ ఫోటో షూట్ లతో ఇంస్టాగ్రామ్ లో సెగలు రేపుతూ ఉంటుంది. మిగిలిన బాలీవుడ్ భామల తరహాలోనే మృణాల్ ఠాకూర్ కూడా ఎక్కువగా ఫోటో షూట్ లు చేస్తూ తనని తాను షోకేస్ చేసుకుంటూ ఉంటారు. ఈ మధ్య గ్లామర్ డోస్ మరింత పెంచి అందాల ప్రదర్శనని మృణాల్ ఠాకూర్ చేస్తూ ఉన్నారు. తాజాగా ఈ అమ్మడు బ్లాక్ కలర్ డ్రెస్ లో కెమెరా లైటింగ్ లో కలర్ ఫుల్ గా మెరిసిపోతోంది. బ్యాక్ నుంచి ఎద అందాలు చూపిస్తూ రెచ్చగొడుతుంది. ఈ ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారాయి. మృణాల్ ఠాకూర్ షేర్ చేసిన ఈ ఫోటోలని 4 నిమిషాల్లో ఏకంగా 1.43 లక్షల మంది లైక్ చేయడం విశేషం. ఈ ఫోటోలలో మృణాల్ బ్లాక్ ఏంజిల్ లా మెరిసిపోతుంది అనేమాట నెటిజన్ల నుంచి వినిపిస్తోంది.

## బాత్ రూంలో స్నాక్స్ తినేదాన్ని..!

బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా మెప్పించిన ప్రియాంక చోప్రా ఆ తర్వాత హాలీవుడ్ సినిమాలు మరియు సిరీస్ ల్లో నటించి పాపులారిటీని సొంతం చేసుకుని గ్లోబల్ స్టార్ గా మారిన విషయం తెల్సిందే. హీరోయిన్ గా ప్రియాంక చోప్రా కు ప్రస్తుతం పాన్ వరల్డ్ గుర్తింపు ఉంది. హాలీవుడ్ సిరీస్ ల ద్వారా స్టార్ ఇమేజ్ దక్కించుకున్న ప్రియాంక చోప్రా పూర్తిగా అమెరికాలోనే సెటిల్ అయ్యింది. అమెరికన్ సింగర్ నిక్ జోనస్ ను వివాహం చేసుకున్న ప్రియాంక చోప్రా అక్కడే ఉంటుంది. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్న ప్రియాంక చోప్రా



ఒకప్పుడు చదువుకు నేందుకు వెళ్లిన సమయంలో అక్కడ చాలా కష్టాలు ఎదుర్కొన్నట్లు ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ప్రియాంక చోప్రా నటించిన ఒక వెబ్ సిరీస్ ప్రమోషన్ లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో.. హై స్కూల్ విద్య కోసం అమెరికా వెళ్లాను. వెళ్లిన కొత్తలో తాను చాలా ఇబ్బందులు పడ్డాను. ముఖ్యంగా అక్కడి వారితో ఎలా మెలగాలో తెలియక ఒంటరితనం ఎదుర్కొన్నాను. అక్కడ ఎవరు పరిచయం అవ్వక పోవడంతో రకరకాలుగా భయాలు ఉండేవి. క్యాంటీన్ కు వెళ్లి ఫుడ్ ఎలా తీసుకోవాలో తెలిసేది కాదు. దాంతో వెండింగ్ మిషన్ లో స్నాక్స్ ను తీసుకుని వాటిని బాత్ రూం లో కూర్చుని తినేసి ఆ తర్వాత క్లాస్ కు వెళ్లే దాన్ని.

చాలా రోజుల పాటు నాకు వేరే వారితో పరిచయం అవ్వక పోవడంతో ఒంటరిగానే ఉండేదాన్ని. నాలుగు వారాల తర్వాత ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఆ తర్వాత స్కూల్ లో పరిచయం చేసుకోవడం మొదలు పెట్టాను. కొందరు స్నేహితులు లేట్ నైట్ పార్టీలని.. పబ్ లంటూ వెళ్లే వారు. వారితో పాటు నన్ను పిలిచినా కూడా మా ఫ్యామిలీ లో అలాంటివి ఒప్పుకోరు అంటూ వాటిని తప్పించుకునేదాన్ని అంటూ ప్రియాంక చోప్రా పేర్కొంది. ఒకప్పుడు మొహమాటంతో ఇబ్బంది పడ్డ పీసీ ఇప్పుడు తన నటనతో పాన్ వరల్డ్ గుర్తింపు దక్కించుకున్న విషయం తెల్సిందే.




## వయసులో ఆ ఫీట్స్ ఏంటి మేడం?



హీరోయిన్ గా ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించిన జ్యోతిక తమిళ హీరో సూర్యను వివాహం చేసుకున్న తర్వాత ఇండస్ట్రీకి దూరం అయిన విషయం తెల్సిందే. పిల్లలు పెద్ద వారు అవ్వడంతో పాటు భర్త ప్రోత్సాహంతో జ్యోతిక మళ్లీ సినిమాల్లో రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. చాలా గ్యాప్ తర్వాత రీ ఎంట్రీ ఇచ్చినా కూడా జ్యోతికకి మంచి కమ్ బ్యాక్ దక్కింది. ఆమె ఎక్కువగా లేడీ ఓరియంటెడ్ సినిమాలను చేస్తున్న విషయం తెల్సిందే. ఇంట్రెస్టింగ్ కథలను ఎంపిక చేసుకుని సినిమాలు చేస్తున్న జ్యోతిక వరుసగా సక్సెస్ లను దక్కించుకుంది. ఈ సమయంలోనే జ్యోతిక తన ఫిజిక్ పై చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జ్యోతిక వయసు ప్రస్తుతం ఇంటర్నెట్ అనుసారం 44 సంవత్సరాలు. సాధారణంగా ఈ వయసులో హీరోయిన్స్ గా ఆఫర్లు రావడం అనేది చాలా తక్కువ... సౌత్ లో ఈ వయసు వచ్చే వరకు హీరోయిన్ గా కంటిన్యూ అవ్వడం దాదాపు అసాధ్యం కానీ జ్యోతిక మాత్రం ఇంకా లేడీ ఓరియంటెడ్ సినిమాలతో హీరోయిన్ గా కంటిన్యూ అవుతున్న విషయం తెల్సిందే. తన సినిమాల కోసం జ్యోతిక చేస్తున్న వర్కౌట్స్ షాకింగ్ గా ఉన్నాయి. తాజాగా ఆమె షేర్ చేసిన ఒక వీడియో చూసి చాలా మంది షాక్ అవుతున్నారు. సింగిల్ హ్యాండ్ పై బ్యాలన్స్ చేయడం తో పాటు హీరోలకు సైతం సాధ్యం కాని కొన్ని ఫీట్స్ ను చేస్తూ అబ్బుర పర్చుతోంది. బాబోయ్ అంటూ చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ ఉన్నారు. ఇంత కష్టం ఏ సినిమా కోసం అంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే.. మీరు ఈ స్థాయిలో వర్కౌట్స్ చేస్తే కొత్త హీరోయిన్స్ ఫిజిక్ విషయంలో సిగ్గుతో తల దించుకుంటారేమో అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి జ్యోతిక వర్కౌట్స్ వీడియో వైరల్ అవుతోంది.

## షూటింగ్ టైం పిక్.. శోభిత ఇలా షాక్ ఇచ్చిందేంటి..!



తెలుగు అమ్మాయే అయినా శోభిత ధూళిపాల బాలీవుడ్ సినిమాలు చేస్తూ అక్కడ కల్చర్ ని అలవాటు చేసుకుంది. సినిమాలే కాదు ఫోటో షూట్స్ లో కూడా బాలీవుడ్ భామలను మించి అనిపించేస్తుంది. అమ్మడు ఈమధ్య సౌత్ సినిమాల్లో కనిపిస్తుంది. అడివి శేష్ సినిమాలతో తెలుగు ఆడియన్స్ ని అలరిస్తున్న శోభిత మణిరత్నం తెరకెక్కించిన పొన్నియిన్ సెల్వన్ సినిమాలో కూడా అలరించింది. సినిమాలో వానాతి రోల్ లో నటించింది శోభిత. ఎప్పుడు వెస్ట్రన్ వేర్ తో అలరించే అమ్మడు ఈ సినిమాలో మాత్రం నిండుగా కనిపించింది. అఫ్కోర్స్ శోభితని అలా చూసిన ఆడియన్స్ ఈ కాస్ట్యూమ్స్ లో అమ్మడు అదిరిపోయిందని అంటున్నారు. సినిమా ఫలితం ఎలా ఉన్నా పిఎస్ 1 2 ఆ సినిమాలో నటించిన వారందరికి మంచి వర్కింగ్ ఎక్స్ పీరియన్స్ ఇచ్చింది. ఇక పొన్నియిన్ సెల్వన్ రిలీజ్ తర్వాత ఆ సినిమా షూటింగ్ లాస్ట్ డే శోభిత చేసిన అల్లరిని లేటెస్ట్ గా తన ఇన్ స్టాగ్రామ్ లో పెట్టింది. తన కాస్ట్యూమ్ తో కనిపించిన అమ్మడు పక్కన ఐశ్వర్య లక్ష్మితో కలిసి స్టెప్పులు వేస్తుంది. మళ్లీ ఆ డ్రెస్ లో తమని తాము చూసుకోవడం కష్టమని భావించి ఫోటోలు వీడియోలు తీసేసుకున్నారు. అయితే రిలీజ్ ముందు పెడితే క్యారెక్టర్ తెలిసిపోతుందని అనుకున్నారో ఏమో కానీ పిఎస్ 2 తర్వాత ఈ ఫోటోలు షేర్ చేసింది. ప్రస్తుతం శోభిత షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. సినిమాల పరిస్థితి ఎలా ఉన్నా అమ్మడు టాలీవుడ్ హీరోతో డేటింగ్ లో ఉందన్న వార్తలు మాత్రం ఆమెను హైలెట్ చేస్తున్నాయి. అక్కినేని నాగ చైతన్యతో శోభిత రిలేషన్ పై రకరకాల వార్తలు వస్తున్నాయి. అయితే వీటిపై శోభిత మాత్రం పెదవి విప్పింది లేదు. పిఎస్ 2 ప్రమోషన్స్ టైం లో కూడా తన డేటింగ్ వార్తలపై ప్రశ్నలు రాకుండా జాగ్రత్త పడింది. ఏది ఏమైనా శోభిత సందడి ఈమధ్య తెలుగు ఆడియన్స్ ని అలరిస్తుందని చెప్పొచ్చు.

## బిగ్ బాస్ పిల్ల.. నిక్కరులో హీటెక్కించిందిగా..

బిగ్ బాస్ రియాల్టీ షో ద్వారా చాలామంది అందాల భామలు సెలబ్రెటీ ఇమేజ్ సొంతం చేసుకున్నారు. ముఖ్యంగా తెలుగులో అయితే సోషల్ మీడియాలో పాపులర్ అయిన బ్యూటీస్ బిగ్ బాస్ లోకి అడుగుపెట్టి విపరీతమైన క్రేజ్ దక్కించుకున్నారు. అక్కడ నుంచి వచ్చిన తర్వాత అదే పాపులరిటీతో రియాలిటీ షోలలో పార్టిసిపేట్ చేస్తూ మరింత ఫేమ్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక హీరోయిన్ గా సక్సెస్ కావాలని ప్రయత్నం చేస్తున్న అందాల భామలు తమలోని హాట్ నెస్ ని బయటకు తీసుకొస్తున్నారు. తెలుగు అమ్మాయిలు అయినా కూడా ఏ మాత్రం తగ్గకుండా గ్లామర్ డోస్ తో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆషు రెడ్డి అరియానా గ్లోరీ తర్వాత ఆ స్థాయిలో ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ గా మారిన మరో బ్యూటీ శ్రీ సత్య. సీరియల్స్ లో నటిగా కెరియర్ ప్రారంభించిన



ఈ అమ్మడు తర్వాత గత ఏడాది బిగ్ బాస్ రియాల్టీ సోలో పార్టిసిపేట్ చేశారు. అక్కడ అందరి దృష్టిని ఆకర్షించి సెలబ్రిటీ ఇమేజ్ సొంతం చేసుకుంది. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ బ్యూటీకి మంచి అవకాశాలు వస్తున్నాయి అనే మాట వినిపిస్తోంది. తెలుగు టెలివిజన్ రియాలిటీ షో షోలలో కూడా పార్టిసిపేట్ చేస్తూ అందరి దృష్టిని ఆకస్తున్నారు. ఈ అమ్మడు గ్లామర్ డోస్ విషయంలో కూడా కాస్త స్పీడ్ పెంచింది అని చెప్పాలి. ఎక్కువగా షార్ట్స్ లో కనిపిస్తూ థైస్ అందాలు చూపిస్తే కుర్రాలను రెచ్చగొడుతుంది. శ్రీ సత్య థైస్ అందాలకు సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్స్ కూడా ఉన్నారు. తాజగా ఈ బ్యూటీ ఇంస్టాగ్రామ్ లో మరోసారి హాట్ ఫోటోని షేర్ చేశారు. ఈ ఫోటో ఇప్పుడు వైరల్ గా మారింది. ఒక కుర్చీలో కూర్చుని మరో కుర్చీపై కాళ్ళు పైకి పెట్టి నిండైన ఆమె థైస్ అందాలు తనువితేరా చూపిస్తుంది. ఈ అందాలని చూస్తున్న కుర్రాళ్ళ గుండెలలో సెగలు రేగుతున్నాయి. ఈ స్థాయిలో రెచ్చగొడుతూ ఉంటే తట్టుకోవడం కష్టం అనే మాట వినిపిస్తోంది.

## ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్ తో రాశీఖన్నా శృంగారం!

థాంక్యూ తర్వాత రాశీఖన్నా కోలీవుడ్..బాలీవుడ్ చిత్రాలపైనే దృష్టి పెట్టింది. టాలీవుడ్ కెరీర్ ఆశించిన విధంగా లేకపోవడంతో! అమ్మడు ఇక ఇక్కడ లాభం లేదనుకుని ఇతర భాషల్నే టార్గెట్ చేసింది. ఆ రకంగా అవకాశాలు బాగానే అందికుంటుంది. ప్రస్తుతం తమిళ్..హిందీలో కలిపి నాలుగైదు సినిమాలు చేస్తుంది. ఇందులో యోధ మాత్రం అమ్మడికి మెమోరిబుల్ మూవీగా నిలిచిపోతుందనే వార్తలొస్తున్నాయి. ఈ సినిమా కోసం అమ్మడు అన్ని రకాలుగా సిద్దపడినట్లు తెలుస్తోంది. ఇందులో రాశీకి జోడీగా సిద్దార్థ్ మల్హోత్రా నటిస్తున్నాడు. రాశీతో పాటు దిశా పటానీ మరో హీరోయిన్ గా నటిస్తుంది. విమానం హైజాక్ నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇందులో సిద్దార్థ్ ఎయిర్ పోర్స్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నాడు. స్టోరీలో




భాగంగా సినిమాలో రొమాంటిక్ సన్నివేశాలు హద్దు మీరే ఉన్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సినిమాలో రాశీఖన్నా శృంగార సన్నివేశాల్లో ఏ మాత్రం తగ్గలేదు అన్న టాక్ బాలీవుడ్ మీడియాలో హల్చల్ చేస్తుంది. ఎగిరే విమానంలో సిద్దార్థ్ ఘాటైన సన్నివేశాల్లో నటించిందిట. హాలీవుడ్ సినిమా తరహాలో హీరో-హీరోయిన్ మధ్య ఇంటిమేట్ సన్నివేశాలు ఆసక్తి కట్టిస్తాయని వినిపిస్తుంది. బెడ్ రూమ్ సన్నివేశాల్ని మించి కొన్ని సన్నివేశాలు ఉన్నాయని అంటున్నారు. ఇలాంటి సన్నివేశాలు రాశీఖన్నాకి కొత్తేం కాదు. కెరీర్ ఆరంభంలో మడి కట్టుకుని కుర్చున్న ఆ తర్వాత రౌడీ స్టార్ విజయ్ దేవరకొండతో వరల్డ్ ఫేమస్ లవర్ లో ఏ రేంజ్ లో నటించిందో తెలిసిందే. అందులో బెడ్ రూమ్ సన్నివేశాల్లో రాశీ పెర్ఫార్మెన్స్ తో విజిల్స్ వేయించింది. స్టోరీ డిమాండ్ లో భాగంగా ఆ రకమైన సన్నివేశాలు వస్తున్నప్పుడల్లా థియేటర్ దద్దరిల్లింది. ఇక బాలీవుడ్ సినిమాలో రియాల్టీ కోసం మరింత అడ్వాంటేజ్ తీసుకుంటారు. ఈ నేపథ్యంలో యోధలో రాశీ రొమాంటిక్ సన్నివేశాలపై ఇప్పటి నుంచి ఆసక్తి మొదలైంది. ఇప్పటికే సిద్దార్థ్ మల్హోత్రాకి రొమాంటిక్ స్టార్ గా మంచి పేరుంది. రాశీఖన్నాతోనూ రొమాన్స వర్కౌట్ అయితే! ఆ ఇమేజ్ రెట్టింపు అవుతుంది.



# ఈ పథకంతో రైతన్నలకు నెలకు రూ.3 వేల పింఛన్

రైతన్నల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయి. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు వంటి స్కీమ్‌లు అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయి. అయితే, ఇవన్నీ వారు వ్యవసాయం చేస్తున్నంతకాలం మాత్రమే అండగా నిలుస్తాయి. ఒకసారి వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి ఆదాయ వనరు ఉండదు. ఈ నేపథ్యంలో వయసు పైబడిన చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం 'ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన' పేరిట సామాజిక భద్రత పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద 60 ఏళ్లు నిండిన రైతులు పింఛన్ పొందొచ్చు. నెలకు కనీసం రూ.3 వేల పింఛన్ అందుతుంది. ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుందాం..

**అర్హులు ఎవరంటే..** దీనికి 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు అర్హులు. దేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల భూ రికార్డుల్లో పేర్లు ఉండి, 2 హెక్టార్ల వరకు సాగు చేయదగిన భూమిని కలిగి ఉండాలి. అలాంటి చిన్న, సన్నకారు రైతులందరూ ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకోవచ్చు. పింఛన్ మాత్రం 60 ఏళ్లు నిండిన తర్వాతే అందుతుంది.

**వీరికి అర్హత లేదు..** నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్), ఈఎస్ఐ స్కీమ్, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్నవారు, ఏవైనా ఇతర చట్టబద్ధమైన సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్నవారు,

జాతీయ పెన్షన్ పథకాన్ని ఎంచుకున్న రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉన్నత ఆర్థిక స్థితి కలిగిన వర్గాల వారు 'పీఎం కిసాన్ మాన్‌ధన్' పింఛన్ పొందడానికి అనర్హులు.

**ప్రీమియం ఇలా..** 60 సంవత్సరాల వయసు నిండేవరకు రైతులు ప్రీమియం కట్టాల్సి ఉంటుంది. 60 ఏళ్లు దాటిన తర్వాత ప్రతినెలా రూ.3 వేల పింఛన్ అందుతుంది. పథకంలో చేరేవారికి వయసును బట్టి ప్రీమియం ఉండగా రైతు చెల్లించిన మేరకు ప్రభుత్వం కూడా తనవంతుగా బీమా కంపెనీకి చెల్లిస్తుంది.

ఉదాహరణకు 18 సంవత్సరాల రైతు తనవాటాగా నెలకు రూ.55 చెల్లిస్తే కేంద్రం తనవాటాగా రూ.55ను కలిపి బీమా కంపెనీకి రూ.110 చెల్లిస్తుంది. 18 ఏళ్లవారికి ప్రీమియం రూ.55 ఉండగా ఏటా వయసును బట్టి రూ.3 నుంచి రూ.10 వరకు పెరుగుతుంది. 40 ఏళ్లవారికి రూ.200 ప్రీమియం ఉంది.

**రైతు మరణిస్తే జీవిత భాగస్వామికి..** పథకంలోని రైతు మరణిస్తే వారి జీవిత భాగస్వామి పథకాన్ని కొనసాగించవచ్చు. 60 సంవత్సరాల వయసు నిండిన తరువాత రూ.3 వేల చొప్పున పింఛన్‌ను అందిస్తారు. వయసు నిండిన తరువాత రైతు మరణిస్తే జీవిత భాగస్వామికి సగం పింఛన్‌ను ఇస్తారు. పథకాన్ని కొనసాగించేందుకుగానూ కనీసం ఐదేళ్లపాటు రైతు తనవాటా ప్రీమియంను నిర్దేశిత తేదీ ప్రకారం చెల్లించాలి. పీఎంకేఎం యోజన పూర్తిగా స్వచ్ఛందం.

**ఇవీ కావాల్సినవి..** సాగుదారులు కామన్ సర్వీస్ సెంటర్లలో తమపేర్లను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. రైతు ఫొటో, నివాస ధ్రువీకరణ, ఆదాయం, వయసు నిర్ధారణ, సాగు భూమి, ఆధార్ తదితర పత్రాలను సమర్పించాలి. అన్ని వివరాలను కేంద్ర పీఎంకేఎం పోర్టర్‌లో నమోదు చేసిన తరువాత రైతుకు సమాచారం వస్తుంది. ప్రత్యేకమైన పింఛన్ ఖాతాను తెరచి కార్డును అందిస్తారు.

# మహేశ్వరానికి వైద్య కళాశాల మంజూరు చేస్తాం: సీఎం కేసీఆర్



తుమ్మలూరు: రాష్ట్రంలో పచ్చదనం పెరిగేందుకు 8 ఏళ్లుగా కృషి చేశామని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. హరితహారం అంటే కాంగ్రెస్ నేతలు జోకులు వేశారని.. ఇప్పుడు అదే కార్యక్రమంతో తెలంగాణలో 7.7 శాతం పచ్చదనం పెరిగిందని చెప్పారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తుమ్మలూరులో ఏర్పాటు చేసిన హరితోత్సవ సభలో కేసీఆర్ మాట్లాడారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. "పాలమూరు ఎత్తిపోతలను అడ్డుకున్న పుణ్యాత్ములు కాంగ్రెస్ నేతలు. సుప్రీంకోర్టుకు వెళ్లి మరీ అడ్డుకున్నారు. ప్రజలకు తాగు, సాగునీరు ఇస్తుంటే అడ్డుకోవడం దారుణం. ఇబ్రహీంపట్నం, మహేశ్వరంలో నీటికష్టాలు తీరిపోతాయి. 'వానలు వాపసు రావాలె.. కోతులు వాపసు పోవాలె..' పాట రాశాను. అడవులు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తాం. ప్రజలకు ఉచితంగా పండ్ల మొక్కల పంపిణీకి ?100కోట్లు కేటాయించాలని నిర్ణయించాం. మహేశ్వరానికి వైద్య కళాశాల మంజూరు చేస్తాం. బీహెచ్ఈఎల్ నుంచి మహేశ్వరంలోని కందుకూరు వరకు మెట్రో తెచ్చేందుకు కృషి చేస్తాను. వరి ఉత్పత్తిలో మనల్ని ఎక్కిరించినవారు ఏడో స్థానానికి పోయారు. రాష్ట్రంలో కనీవిని ఎరుగని సంక్షేమ పథకాలు మీరు చూస్తున్నారు. తుమ్మలూరుకు రూ.కోటితో కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తున్నాం.

కమ్యూనిటీ హాల్‌కు దశాబ్ది పేరు పెట్టాలని కోరుతున్నాను. జల్‌పల్లి, తుక్కుగూడకు చెరో రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నాం. బడంగ్‌పేట పురపాలికకు రూ.50 కోట్లు మంజూరు చేస్తున్నాను. అటవీశాఖ అధికారులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటాం. సొంత పిల్లలను పెంచినట్లు మొక్కలను సాకాలి" అని సీఎం కేసీఆర్ కోరారు.

# ప్రపంచంలో అన్ని వసతులతో అభివృద్ధి చెందే అరుదైన ప్రదేశాల్లో తెలంగాణ ఒకటి: మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్: అన్నిరకాల మౌలిక వసతులతో రాష్ట్రం అభివృద్ధి చెందుతున్నదని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఇలా ప్రపంచంలో అన్ని వసతులతో అభివృద్ధి చెందే అరుదైన ప్రదేశాల్లో తెలంగాణ ఒకటని చెప్పారు. రాష్ట్రంలో గ్రీన్ కవర్ 7.7 శాతం వృద్ధి చెందిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ప్రవేశపెట్టిన హరితహారంతోనే ఇది సాధ్యమైందన్నారు.

సీఎం కేసీఆర్ వంటి నిజమైన పర్యావరణవేత్తే సమగ్ర, స్థిరమైన అభివృద్ధి గురించి ఆలోచిస్తామరని వెల్లడించారు. ప్రతి ప్రభుత్వం ఏం చేయాలో ప్రపంచానికి తెలంగాణ సగర్వంగా చాటిచెప్పిందని తెలిపారు. తెలంగాణ ఆచరిస్తుంది, దేశం అనుసరిస్తుందని ట్వీట్ చేశారు. హరితహారంలో భాగంగా రాష్ట్రంలో 14,864 నర్సరీలను, 19,472 పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటుచేశామన్నారు. మొత్తం 13.44 లక్షల ఎకరాల్లో అడవులను పునరుద్ధరించామని, ఇప్పటివరకు 273 కోట్ల మొక్కలను నాటామన్నారు.

# హరితోత్సవం.. ఉప్పల్ భగాయత్‌లో మొక్కలు నాటిన ఎంపీ సంతోష్ కుమార్



హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా హరితోత్సవం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ మేడ్చల్ జిల్లాలోని ఉప్పల్ భగాయత్‌లోని హెచ్ఎండీఏ లేఔట్‌లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, పార్టీ నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటిన ప్రతిఒక్కరిని ఎంపీ సంతోష్ అభినందించారు.

హరితహారం కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. తొమ్మిదేండ్లలో హరితహారం, గ్రీన్ ఇం డియా చాలెంజ్ ద్వారా ప్రజల్లో పచ్చదనంపై చైత న్యం తీసుకొచ్చామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో ఎంతో పచ్చదనం పెరిందని వెల్లడించారు.

# హరితహారంలో ప్రభుత్వం చెబుతున్నవన్నీ కాకి లెక్కలు



హైదరాబాద్: సీఎం కేసీఆర్ దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పది సంవత్సరాలు కాకున్నా దశాబ్ది ఉత్సవాలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ పాలనలో ఆయన కుటుంబం రాష్ట్రాన్ని కొల్లగొట్టారని అన్నారు. హరితహారం పేరుతో ప్రజా ధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. హరితహారానికి రూ.11 వేల కోట్లు ఖర్చు చేశామని కేసీఆర్ చెబుతున్నారని.. రాష్ట్రంలో హరితహారానికి రూ.11 వేల కోట్లు ఖర్చు చేసిన మొక్కలు ఎక్కడ అని ప్రశ్నించారు. చెప్పిన లెక్కలకు వాస్తవానికి చాలా తేడా ఉందన్నారు. హరితహారం కోసం చేసిన ఖర్చులో 70 శాతం డబ్బులు దోచేశారని ఆయన ఆరోపించారు. హరితహారంలో విచ్చల విడిగా డబ్బులు దోచేశారన్నారు. సర్కార్ చెబుతున్నట్లు నాటిన మొక్కలకు రాష్ట్ర భూమి సరిపోదని తెలిపారు. హరితహారంలో ప్రభుత్వం చెబుతున్నవన్ని కాకి లెక్కలన్నారు. కేసీఆర్ చెప్పేవన్నీ వస్తవాలైతే సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. నీళ్ళ దోపిడీ, ఇసుక దోపిడీ, చెట్ల పేరుతో దోపిడీ, ప్రాజెక్టల పేరుతో దోపిడీ, లిక్కర్ దోపిడీ జరుగుతోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హరితహారం అవినీతిపై విచారణ జరిపిస్తామన్నారు. మొక్క మొక్కకు లెక్క తీస్తామని తెలిపారు. సచివాలయం నిర్మాణంలో అవినీతి జరిగిందని ఆరోపించారు.



# నేపాల్‌ను ముంచెత్తిన వరదలు

కాఠ్‌మాండూ: హిమాలయ దేశం నేపాల్‌లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు సంభవించాయి. వర్షాల కారణంగా అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. వరదల్లో ఇప్పటి వరకు ఐదుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో 28 మంది గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. తూర్పు నేపాల్‌లో వరదల ప్రభావం తీవ్రంగా ఉంది.

చైన్‌పుర్ మున్సిపాలిటీ–4 ప్రాంతంలో హేవా నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో సూపర్ హేవా హైడ్రోపవర్ ప్రాజెక్టు వద్ద వరదలు సంభవించి అక్కడ పనిచేసే కార్మికులు గల్లంతయ్యారు. అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. చైన్‌పుర్, పంచఖపన్ మున్సిపాలిటీల్లో కొండచరియలు విరిగిపడి హేవా నది ప్రవాహాన్ని అడ్డుకున్నాయి. దీంతో వరదలు సంభవించినట్లు అధికారులు తెలిపారు. వరదలకు పలు ప్రాంతాల్లో ఇళ్లు కొట్టుకుపోయాయి. దేశంలోకి గత బుధవారం రుతుపవనాలు ప్రవేశించాయి. దీంతో రానున్న రోజుల్లో నేపాల్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. నదుల్లో నీటిమట్టం పెరగడంతో సమీప ప్రాంతాల ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వరద సంబంధిత మరణాలపై నేపాల్ ప్రధాని పుష్ప కుమార్ దహల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



# 24 గంటలుగా అదృశ్యమై.. ఇంటి దగ్గర్లోనే విగతజీవులుగా..

నాగ్‌పూర్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. 24 గంటల పాటు కనిపించకుండా పోయిన ముగ్గురు చిన్నారుల కోసం కుటుంబ సభ్యులు, పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. చివరకు వారు ఇంటిదగ్గర కారులోనే నిర్జీవంగా కనిపించారు. పోలీసులు కథనం ప్రకారం.. నాగ్‌పూర్‌లోని పచ్‌పోలీ పోలీసు స్టేషన్ పరిధిలో నివసిస్తోన్న తౌఫిఖ్ ఫిరోజ్ ఖాన్(4), అలియా ఫిరోజ్ ఖాన్(6), అఫ్రిన్ ఇర్షద్ ఖాన్(6) శనివారం సాయంత్రం మూడు గంటల నుంచి కనిపించకుండా పోయారు.

సమీపంలోని గ్రౌండ్‌లో ఆడుకోవడానికి వెళ్లి ఉంటారని తల్లిదండ్రులు భావించారు. అయితే, రాత్రి కావొస్తున్న పిల్లల జాడ కనిపించకుండాపోయే ఆందోళనకు గురైన వారు.. పోలీసుల్ని ఆశ్రయించారు. దాంతో కిడ్నాప్ కేసు నమోదు చేసిన పోలీసులు.. వారి కోసం ఆ ప్రాంతంలో గాలించారు. ఆదివారం సాయంత్రం వరకు కూడా చిన్నారుల ఆనవాలు దొరకలేదు. చివరకు రాత్రి ఏడుగంటల సమయంలో వారు ఓ కారులో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే కారు డోరు తెరిచి చూడగా.. ముగ్గురు విగతజీవులుగా కనిపించారు. ఆ కారు ఇంటికి 50 మీటర్ల దూరంలోనే తుక్కు దుకాణం ముందు ఉండటం గమనార్హం.

చిన్నారులు ఆడుకునే క్రమంలో కారులోకి ఎక్కడం, తర్వాత దాని లాక్ పడిపోవడం వల్లే ఈ మరణాలు సంభవించి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఊపిరాడక వారు చనిపోయారని ప్రాథమిక నివేదికను బట్టి తెలుస్తోంది. పోస్టుమార్టం తర్వాత అసలు కారణాలు తెలుస్తాయని అధికారులు వెల్లడించారు. తౌఫిక్, అలియా తోబుట్టువులని, అఫ్రిన్ వారి స్నేహితురాలని తెలిపారు.

# దశాబ్దాల పాటు ధ్వంసమైన పర్యావరణానికి వరం.. తెలంగాణ హరితహారం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : తెలంగాణ తల్లి ఆకుపచ్చ చీర కట్టుకున్నట్టు.. భూమి తల్లికి పచ్చని రంగేసినట్టు.. ఇప్పుడు ఎక్కడ చూసినా పచ్చని చెట్లతో తెలంగాణ ప్రాంతం అలరారుతున్నది. దశాబ్దాలపాటు నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ ప్రాంతం.. నేడు పచ్చని పంటలతో, మైదాన ప్రాంతం నిండుగా దట్టమైన చెట్లతో మూడమూచ్చటగా ఉన్నది. ఇదంతా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమం వల్లే సాధ్యమైంది. తెలంగాణ రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇవాళ హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. దశాబ్దాల పాటు ధ్వంసమైన పర్యావరణానికి వరం.. మహోద్యమంలో సాగుతున్న తెలంగాణ హరితహారం అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ పునర్నిర్మాణం అంటే.. ప్రజల బతుకుచిత్రాన్ని మార్చడమే కాదు.. ధ్వంసమైన అడవులను పునరుద్ధరించడం.. సకల జీవరాశులను సంరక్షించడం అని యావత్ దేశానికి సగర్వంగా చాటిచెప్పిన దార్శనిక ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని పేర్కొన్నారు. గ్రేట్ వాల్ ఆఫ్ చైనాను తలదన్నేలా.. ఈ గ్రీన్ వాల్ ఆఫ్ తెలంగాణ నిర్మాణంలో.. భాగస్వాములైన ప్రకృతి ప్రేమికులందరికీ హృదయపూర్వక దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు అని పేర్కొంటూ కేటీఆర్ తన ట్వీట్ ముగించారు.

# భవిష్యత్ తరాలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదు.. మంచి వాతావరణం : మంత్రి తలసాని



హైదరాబాద్ : భవిష్యత్ తరాలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదు.. మంచి వాతావరణం అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా మారేడ్‌పల్లిలోని పార్కులో మంత్రి తలసాని మొక్కలు నాటారు. పద్మారావు నగర్‌లోని చిదానందం కాలనీలో దశాబ్ది పార్కును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ ఒక్క రోజే నగరంలో 60 దశాబ్ది పార్కులను ప్రారంభించుకున్నామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి ప్రత్యేక పర్యవేక్షణ, కృషితో చేపట్టిన హరితహారంతో రాష్ట్రంలో పచ్చదనం పెరిగిందన్నారు. పల్లె ప్రకృతి వనాలు, పట్టణాలలో పార్కుల నిర్మాణం, రహదారుల వెంట మొక్కల పెంపకం చేపట్టడం జరిగింది. ప్రతి ఒక్కరు మొక్కలను నాటి పరిరక్షించాలి అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు.

# ఎంపీ ల్యాడ్స్‌ను వాడుకున్నా.. బాపురావు సంచలన వ్యాఖ్యలు



ఆదిలాబాద్: ఎంపీ ల్యాడ్స్ నిధులపై బీజేపీ ఎంపీ సోయం బాపు రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీ ల్యాడ్స్‌ను తన ఇంటి నిర్మాణంతో పాటు కొడుకు పెళ్లి కోసం కూడా వాడుకున్నానని బాపురావు ప్రకటించారు. జిల్లాలో జరిగిన బీజేపీ నేతల సమావేశంలో ఎంపీ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఎంపీలు మొత్తం నిధులు అమ్ముకున్నారని.. తాను మాత్రం కొన్ని నిధులు మాత్రమే వాడుకున్నట్లు బహిరంగంగా ఒప్పుకున్నారు. బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్, అర్వింద్‌ల కంటే తనకే ఎక్కువ నిధులు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న నిధులను కార్యకర్తలందరికీ సమానంగా కేటాయిస్తానంటూ ఎంపీ బాపురావు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఎంపీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ సర్కిల్‌లో చర్చనీయాంశంగా మారాయి.

అభివృద్ధి కోసం ఉపయోగించాల్సిన ఎంపీ ల్యాడ్స్‌ను ఇష్టానుసారంగా ఎలా వాడుకుంటారని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ప్రజల కోసం ఖర్చు చేయకుండా సొంత ప్రయోజనాలకు ఎంపీ నిధులను వాడటం పట్ల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ బాపురావుపై చర్యలు తీసుకోవాలని పలు పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఎంపీ వ్యాఖ్యలు సొంత పార్టీ నేతల కూడా షాక్‌కొట్టినట్లైంది. మరి ఎంపీ బాపురావు వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం ఎలా స్పందిస్తుందో చూడాలి మరి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com